Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03






# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# జోరు పెంచిన జగన్



## > టీడీపీకి, వైసిపికి రేపటి ఎన్నికలే ఫైనల్స్?
## > గెలిచిన పార్టీ చరిత్ర తెరపైకి.. ఓడిన పార్టీ చరిత్ర గర్భంలోకి..?

***2014లో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం ఏమిటన్న ప్రశ్నకు చాలామంది చెప్పే సమాధానం బీజేపీతో పొత్తు పెట్టుకోవడం, ఇంకొందరు చెప్పేది పవన్ కళ్యాణ్ మద్దతు పలకడం, మరికొందరు చెప్పేది చంద్రబాబు చేసిన ఋణ మాఫీ వాగ్దానాన్ని రైతులు నమ్మడం. వీటిలో కొంతవరకు వాస్తవం వుండొచ్చు. అయితే అన్నింటికంటే కరెక్ట్ సమాధానం తెలుగుదేశం అధికారంలోకి రావడానికి కారణం వైకాపా అధినేత జగన్! ఇది నమ్మాల్సిన నిజం కూడా!***

జగన్ 2014 ఎన్నికలను జాగ్రత్తగా చేసుకుని వుంటే అధికారం అతని చేయి దాటిపోయేది కాదు. వస్తామన్న కాంగ్రెస్ కేడర్‌ను చేర్చుకుని వున్నా, చంద్రబాబులాగే రైతు ఋణమాఫీ వాగ్దానం చేసున్నా, ఒక మతపరమైన ముద్రను పడకుండాచేసుకుని వున్నా వైసిపిదే అధికారం. కాని ఉత్తుత్తి వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి వున్నా, ఇప్పటికే ఫెయిలై వుండేవాడు. హామీల విషయంలో వాస్తవాలకు కట్టుబడి అధికారానికి దూరమైనా, (మిగతా 10వ పేజీలో)

## శతమానం భవతి





'లాయర్' వారపత్రిక వ్యవస్థాపకులు కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డి - శ్రీమతి శ్రీదేవమ్మల మనుమడు, తుంగా శివప్రభాత్‌రెడ్డి - శ్రీమతి భారతిల కుమారుడు శివప్రజిత్, హైదరాబాద్ వాస్తవ్యులు యర్రగొండ శ్రీనివాస్‌రెడ్డి - శ్రీమతి కుసుమల కుమార్తె సింధూరల పరిణయ మహోత్సవం ఏప్రిల్ 29న హైదరాబాద్, సంధ్య కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ఈ వేడుకలో కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు, వైయస్సార్సీపీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త జి.వి.కె.రెడ్డి, రాష్ట్ర మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు కె.వి.పి.రామచంద్రరావు, విజయసాయిరెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. మరిన్ని వివరాలు 3, 12 పేజీలలో

### నెల్లూరు
# మిషన్ భగీరథుడు
## పల్లెవాసుల దాహం తీరుస్తున్న ప్రభాకరుడు

**మం**డుటెండలో ఓ బాటసారి నడిచిపోతున్నాడు... నడిచి నడిచి ఎండ దెబ్బకు శోషవచ్చి పడిపోయాడు. ఆ టైంలో అతనికి రియాజ్ బిరియాని పెట్టినా, మురళీకృష్ణ స్వీట్స్ తినిపించినా... ఫలితం ఉంటుందా? ఆ సమయంలో అతనికి కావాల్సింది గుక్కెడు నీళ్ళు. ఆపదలో వున్నవాడి అవసరాన్ని గుర్తించి చేసే దాన్ని మానవత్వంతో కూడిన దానం అంటారు. ఇప్పుడు అలాంటి అవసరాన్ని గుర్తించే ఓ వ్యక్తి గొంతెండిపోతున్న పల్లెలకు గుక్కెడు నీళ్ళు అందించే కార్యక్రమం పెట్టుకున్నాడు. (మిగతా 10వ పేజీలో)





# నెల్లూరు కబుర్లు

## నగరంలో తీవ్ర నీటి ఎద్దడి

నెల్లూరులో తాగునీటి సమస్య నానాటికీ తీవ్రమవుతోంది. గత ఏడాది వర్షాలు లేకపోవడం మూలంగా భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. బావులు, బోర్లు ఎండిపోయాయి. ఆయా కాలనీవాసులతో పాటు అపార్ట్‌మెంట్లలో వుండేవాళ్లు సైతం కార్పొరేషన్ నీళ్ల మీదే ఆధారపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పైప్‌లైన్‌లు బ్లాకై నీళ్ళు రాక ప్రజలు అవస్థలు పడుతున్నారు. హోటల్స్, హాస్పిటల్స్ వంటి వ్యాపార సంస్థలతో పాటు అపార్ట్‌మెంట్లలో వుండే వాళ్లు కూడా ట్యాంకర్ల ద్వారా నీళ్ళను కొనుగోలు చేస్తున్నారు. కార్పొరేషన్ ఇచ్చే నీళ్ళు తాగడానికే సరిపోకపోతుండగా, కొందరు నీటిని ఇంటి వరండాలు తడపడానికి, ఇళ్లల్లో కార్లు కడగడానికి వృధా చేస్తున్నారు. కొన్ని కొళాయిల వద్ద వాల్వ్‌లు, టాప్‌లు పోయి నీటి వృధా ఎక్కువగా ఉంటోంది. నీటివృధాపై కూడా కార్పొరేషన్ అధికారులు దృష్టి పెట్టాల్సివుంది.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన మెట్టుకూరు



ఈ నెల 1వ తేదీన నెల్లూరులోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వద్ద బ్యాంకు సిబ్బంది, సహకార శాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి ప్రారంభించారు. వేసవిలో బ్యాంకుకు వచ్చే ప్రజలతో పాటు దారినపోయే పాదచారుల దాహార్తిని తీర్చడానికి ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పి, దీనిని ఏర్పాటు చేసిన ఉద్యోగులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వైస్‌ఛైర్మెన్ నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, బ్యాంకు సిఇఓ సరిత, నెల్లూరు డివిజన్ డిఎల్‌సిఓ తిరిపాల్‌రెడ్డి, ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు వై.రామకృష్ణారెడ్డి, సంఘం జిల్లా కార్యదర్శి దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 'బాహుబలి' చూసిన వెంకయ్య

ఎప్పుడూ క్షణం తీరికలేకుండా దేశమంతటా తిరుగుతుండే కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు ఎంతో తీరిక చేసుకుని 29వ తేదీ హైదరాబాద్‌లో 'బాహుబలి' సినిమా చూసారు. వెంకయ్యకు సినిమాలు చూసే అవకాశం రావడం అరుదు. అప్పుడెప్పుడో ఎన్టీఆర్, ఏఎన్నార్ సినిమాలను తీరిక దొరికినప్పుడు చూసేవాడు. బాహుబలి చిత్రానికి వున్న ప్రాధాన్యత దృష్ట్యా అది పనిగా చిత్ర నిర్మాతల కోరిక మేరకు ఆయన ఆ సినిమా తిలకించారు. అదీగాక కేంద్రంలో సినిమాలకు సంబంధించిన మంత్రి కూడా ఆయనే!

## అదరగొడుతున్న 'బాహుబలి'

గత నెల 28వ తేదీన ప్రభాస్ హీరోగా నటించిన బాహుబలి-2 సినిమా విడుదల కావడం తెలిసిందే! బాహుబలి-1 వచ్చి రెండేళ్లయ్యింది. మొదటి పార్ట్‌లో బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపాడు అన్నది సస్పెన్స్‌లోనే పెట్టారు. ఆ సస్పెన్స్‌ను తొలగించుకునేందుకు ప్రేక్షకులు బహుబలి-2 టిక్కెట్ల కోసం ఎగబడ్డారు. నెల్లూరులో పది స్క్రీన్‌లలో ఈ సినిమాను ప్రదర్శిస్తున్నా ఈరోజుకీ టిక్కెట్లు దొరకడం గగనంగా వుంది.

## డ్రైనేజీ పనులు పరిశీలించిన మంత్రి



నెల్లూరులో జరుగుతున్న భూగర్భడ్రైనేజీ, తాగునీటి పథకాల పనులను 1వ తేదీ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పరిశీలించారు. అధికారులు చూపించిన నగరాభివృద్ధి ప్లాన్‌లను పరిశీలించారు. నగరంలో 30శాతం భూగర్భడ్రైనేజీ పనులు పూర్తయ్యాయని, ఏడాదిలోగా మిగతా 70శాతం పనులను కూడా పూర్తి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి నారాయణ తెలిపారు. పనులు పూర్తికాగానే పగులగొట్టిన అన్ని సిమెంట్‌రోడ్లను శుభ్రంగా వేయిస్తామని చెప్పారు. నగరంలో భారీవర్షాలప్పుడు నీళ్లు పోయేందుకు వరద కాలువలను వెడల్పు చేయాల్సి వుందని, నగరంలో 13కాలువల ఆధునీకరణకు కాలువల స్థలాలను ఆక్రమించిన 4,500 కుటుంబాలను ఖాళీ చేయించాల్సిన అవసరముందని, వారి కోసం ప్రత్యేకంగా 4వేల ఇళ్లను నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులకూ పెన్షన్ ఇవ్వండి



పోలీసులకు పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపి పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. 2వ తేదీ నెల్లూరులోని పోలీసు సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2004 నుండి పెన్షన్ విధానాన్ని రద్దుచేసి కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీంను ప్రవేశపెట్టినందువల్ల పోలీసులకు భద్రత లేకుండా పోయిందన్నారు. పోలీసులు నిత్యం అరాచకశక్తులతో సమరం చేస్తుంటారు. పోలీసుల మీద ప్రజలే కాదు, వారి కుటుంబ సభ్యులు కూడా ఆధారపడి వుంటారు. విధి నిర్వహణలో ఒక పోలీస్ మరణిస్తే పెన్షన్ రాక జీవితాంతం ఆ పోలీస్ మీద ఆధారపడి వున్న కుటుంబసభ్యులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మేం మావోయిస్టులతో పోరాడుతుంటాం, మాఫియా గ్యాంగ్‌లతో పోరాడుతూ ప్రాణాలు పోగొట్టుకుంటుంటాం, మావోయిస్టుల చేతిలో దేశవ్యాప్తంగా 5వేల మంది పోలీసులు చనిపోగా ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే వెయ్యిమంది పోలీసులు అశువులు బాసారు. పెన్షన్ లేకపోతే వీరి కుటుంబాలన్నీ ఎలా బ్రతకాలని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను గుర్తించి వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కండీషనరీ బేసిస్ క్రింద కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు గంగాధర్, జిల్లా అధ్యక్షులు యం.ప్రసాద్‌రావు, సభ్యులు తురకా శ్రీనివాసులు పాల్గొన్నారు.

## అరుణమ్మ సేవలు అద్వితీయం.. ఆదర్శప్రాయం

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా వుంటూ పార్టీకి ఎనలేని సేవలు చేసిన దివంగత నాయకురాలు పందిళ్ళపల్లి సేవలు అద్వితీయమైనవని, అందరికీ ఆదర్శప్రాయమైనవని, ఆమె పార్టీకి, జిల్లా మహిళారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి ప్రశంసించారు. అరుణమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం నెల్లూరులోని బాలాజీనగర్‌లో వున్న అరుణమ్మ నివాసంలో ఆమె కుటుంబసభ్యులు వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పనబాక లక్ష్మి అరుణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య, పిసిసి నాయకుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, పి.సీతారాంబాబుతో పాటు అరుణమ్మ కుటుంబసభ్యులు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి, పందిళ్ళపల్లి హేమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### ఇందిరాభవన్‌లో...

నగరంలోని ఇందిరాభవన్‌లోనూ నగర కాంగ్రెస్ అధ్యక్షులు ఉడతా వెంకట్రావ్ ఆధ్వర్యంలో అరుణమ్మ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించి, అరుణమ్మ పార్టీకి, ప్రజానీకానికి చేసిన సేవలను స్మరించుకుని అరుణమ్మకు ఘనంగా నివాళులర్పించారు. పార్టీయే ఊపిరిగా జీవించిన అరుణమ్మ పార్టీకి చేసిన సేవలు అమోఘమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సివి శేషారెడ్డి ఈ సందర్భంగా కొనియాడారు. దాదాపు పాతికేళ్ళపాటు అరుణమ్మ పార్టీకి సేవలందించారన్నారు. అరుణమ్మ కాంగ్రెస్‌పార్టీకి, ప్రజలకు చేస్తున్న సేవలను అప్పట్లో మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కూడా ఎంతగానో అభినందించే వారని ఆయన అన్నారు. తొలుత సివి శేషారెడ్డి అరుణమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు అనూరాధారెడ్డి, కాంగ్రెస్ నాయకులు బాల సుధాకర్, రఘురామ్ ముదిరాజ్, సాయి గోపాల్, మల్లికార్జునరావు, నారాయణ రావు తదితరలు పాల్గొని అరుణమ్మకు ఘన నివాళులర్పించారు.



## క్రీడాకారులకు పౌష్టికాహారం



నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరాలలో శిక్షణ పొందుతున్న సుమారు 600మంది క్రీడాకారులకు కోడిగుడ్లు, పండ్లు, బిస్కెట్లు పౌష్టికాహారంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కిమ్స్ హాస్పిటల్ డాక్టర్ సి.యస్.శ్రీనివాసరాజు, నగర కార్పొరేటర్ మేకల రజని పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో వేసవి శిక్షణా శిబిరాలు తొలి మెట్టు అన్నారు. ఇక్కడ నైపుణ్యంతో పాటు ప్రదర్శన, పట్టుదలను పెంపొందించుకొనేందుకు ఈ క్రీడా ప్రాథమిక సౌకర్యాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి దాతలుగా బెజవాడ సుందరరామిరెడ్డి, పి.దయాకర్‌రెడ్డి, యస్.నరశింహారెడ్డి, ఎన్.వి.రమణారెడ్డి వ్యవహరించారు. అధ్యక్షులు వేలూరు రంగారావు, సెక్రటరి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, బి.మనోహర్‌రెడ్డి, డిప్యూటి గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, ఎస్.రాఘవేంద్ర షెట్టి, ఓబులురెడ్డి, డా॥ కె.అంకిరెడ్డి, డియస్‌డిఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.








# శతమానం భవతి








## శివప్రజిత్ - సింధూర

'లాయర్' వారపత్రిక వ్యవస్థాపకులు కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డి - శ్రీమతి శ్రీదేవమ్మల మనుమడు, తుంగా శివప్రభాత్‌రెడ్డి - శ్రీమతి భారతిల కుమారుడు శివప్రజిత్, హైదరాబాద్ వాస్తవ్యులు యర్రగొండ శ్రీనివాస్‌రెడ్డి - శ్రీమతి కుసుమల కుమార్తె సింధూరల పరిణయం వైభవోపేతంగా జరిగింది. ఏప్రియల్ 29 శనివారం నాడు హైదరాబాద్‌లోని సంధ్య కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కళ్యాణ వైభవంలో పలువురు తుంగా కుటుంబ ఆప్తులు, ఆత్మీయులు, రాజకీయ రాజకీయేతర ప్రముఖులు, "లాయర్" అభిమానులు పాల్గొని నూతన వధూవరులను 'శతమానం భవతి' అంటూ ఆశీర్వదించారు.






## 'ప్రభా'తం

# పైశాచిక..పాక్

**ఒకవైపు కశ్మీర్‌లోయలో ఆందోళనల మంటలు పెట్టి చోద్యం చూస్తూనే, మరోవైపు సరిహద్దుల్లో మన జవాన్లపై అమానుషత్వాలకు పాల్పడుతూ పాక్ తన దుర్మార్గాన్ని చాటుకుంటోంది. ఉగ్రవాదానికి పుట్టినిల్లయిన పాక్, ఉగ్రవాదాన్ని వ్యతిరేకించే భారత్‌ను అడుగడుగునా భయపెట్టాలని చూస్తూనే వుంది. అయితే, పాక్ దుశ్చర్యలకు భారత్ ఏనాడూ భయపడదని పాక్‌కి తెలిసిందే. ఇకనైనా భారత్‌పై అకృత్యాలు మానకుంటే..చివరికి నష్టపోయేది తానేనన్నది కూడా పాక్ తెలుసుకోవాల్సి వుంది.**

ఒకవైపు కొందరు కాల్పులు జరుపుతారు. ఆ కాల్పులను అడ్డుకునేందుకు సైనికులు ప్రయత్నిస్తుంటే, మరోవైపు నుంచి మరికొంతమంది ముష్కరులు దొంగదెబ్బతీసి దొరికిన జవాన్లను దొరికినట్లు చంపుతారు. ఇదీ... నీతి లేని పాక్ సైనిక దుర్నీతి. ఈ అకృత్యాలు ఈనాటివి కావు. ఎప్పటినుంచో పాక్ ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడుతూనే వుంది. తాజాగా జమ్ము కాశ్మీర్‌లోని పూంఛ్‌లోనూ పాక్ తన పైశాచిక తత్వాన్ని ఇలాగే ప్రదర్శించింది. సరిహద్దు నియంత్రణ రేఖ వద్ద గస్తీలో వున్న మన జవాన్లను ఇద్దరిని పాక్ సైనికులు అత్యంత కిరాతకంగా పొట్టనబెట్టుకున్నారు. పాక్ సైనికులు, ఉగ్రవాదులు సభ్యులుగా వున్న బోర్డర్ యాక్షన్ టీమ్ (బిఏటి) సభ్యులు దొంగచాటుగా భారత భూభాగంలోకి ప్రవేశించి గస్తీలో వున్న ఇద్దరు జవాన్లను దారుణాతిదారుణంగా హతమార్చారు. ఆటోమేటిక్ ఆయుధాలు, రాకెట్ లాంచర్లతో విరుచుకుపడి వారిపై గుళ్ళ వర్షం కురిపించారు. అంతేకాదు, అత్యంత అమానవీయంగా ఆ జవాన్ల శరీరాలను ఛిద్రం చేసి, తలలు నరికివేశారు. తామూ సైనికులమేనన్న స్థితిని, సైనిక నీతిని సైతం అహంకారంతో విస్మరించారు.

ఈ ఘటనలో సిక్కు పదాతిదళానికి చెందిన నాయబ్ సుబేదార్ పరంజీత్ సింగ్, సరిహద్దు భద్రతాదళంలోని 200వ బెటాలియన్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ ప్రేమ్‌సాగర్ ఇద్దరూ పాక్ సైనికుల కాఠిన్యానికి బలిపోయారు. పాక్ అమానుషత్వానికి, పైశాచికత్వానికి ఇది పరాకాష్ట. ఈ సంఘటన మనదేశాన్నంతా కుదిపివేసింది. సైనికులను కాల్చి చంపి, అత్యంత కిరాతకంగా వారి తలలు నరికి.. మొండెం నుంచి వేరుచేయడం, దేహాలను ముక్కలు చేయడం పట్ల దేశమంతటా ఆగ్రహ జ్వాలలు మిన్నంటాయి. నియంత్రణరేఖను అతిక్రమించి భారత భూభాగంలోకి జొరబడడం, దొరికిన సైనికులను దొరికినట్లు కాల్చిచంపడం, కాల్పుల విరమణ ఒప్పందాన్ని తరచూ ఉల్లంఘించడం తొలి నుంచీ పాక్ చేస్తున్న అకృత్యాలే. కయ్యానికి కాలుదువ్వే తత్వంతో చేస్తున్న పాక్ కుయత్నాలను భారత్ ఎప్పటికప్పుడు అడ్డుకుంటూనే వుంది. పాక్ దుర్నీతిని ప్రపంచానికి తెలియజెప్పూనే వుంది.

అయితే, ఇటీవల పాక్ ఆర్మీచీఫ్‌గా జావేద్‌బజ్వా వచ్చాక మన సైనికులపై పాక్ సైనికుల అమానుషత్వం మరింతగా పెరిగిపోయింది. సైనికులను చంపడమే కాక, వారి మృతదేహాలపై కూడా కక్ష తీర్చుకునే పైశాచిక పద్ధతి ఎంత అమానవీయమో!..అయినా పైశాచికత్వానికి మారుపేరుగా, కరడుగట్టిన ఉగ్రవాదానికి మారుపేరుగా తయారైన పాక్‌కు ఇలాంటివన్నీ మామూలే. ఎంతటి ఘోరమైన అకృత్యాలనైనా అవేమీ పెద్దవిషయం కాదన్నట్లు వ్యవహరించడం, తమపై ఆరోపణలు చేయడం సరికాదని అనడం, ఆధారాలుంటే చూపండంటూ హుంకరించడం, కావాలనే తమపై ఆరోపణలు చేస్తున్నారని దబాయించడం, అసలు అలాంటి ఘాతుకాలు తమకు తెలియనే తెలియదన్నట్లు బుకాయించడం వంటివన్నీ పాక్‌కు మామూలే.

ఇలాంటి ఎత్తులు జిత్తులన్నీ పాక్ ఎంతోకాలం నుంచీ చేస్తున్నవే. భారత్-పాక్ దేశాల మధ్య వున్న విభేదాలు పరిష్కరించుకునేందుకు కొద్దిగా సానుకూల వాతావరణం ఏర్పడినట్లు భావిస్తే చాలు.. ఇలాంటి అఘాయిత్యాలతో మళ్ళీ కయ్యానికి కాలుదువ్వే విధంగానే వ్యవహరించడం పాక్‌కు అలవాటు. అది దాని నైజం. పాక్ దుర్మార్గాలకు వెరవకుండా ఆరు నెలల క్రితం భారత్ సేనలు సర్జికల్‌దాడులు చేసిన తర్వాత, పాక్ తన దుందుడుకు చర్యలకు ఇక స్వస్తి చెప్తుందనే అందరూ భావించారు కానీ, పాక్ వ్యూహాత్మకంగా మళ్ళీ ఇలాంటి కిరాతకాలకు ఒడిగడుతూనే వుండడం దారుణం.

భారత్‌లో దౌష్ట్యాలకు పాల్పడడం పాక్‌కు అలవాటే. భారత జవాన్లను చంపడం, వారి మృతదేహాలను ముక్కలుముక్కలు చేసి వికృతహాసం చేయడం కూడా ఇటీవల వారికి చాలా మామూలైపోతోంది. కేవలం ఆరు నెలల కాలంలోనే మూడుసార్లు పాకిస్తాన్ సైనికులు ఇలాంటి కిరాతక చర్యలకు పాల్పడ్డారు. గత ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో భారతజవాన్ల పట్ల ఇలాగే అమానుషత్వం ప్రదర్శించారు. ఈ రెండు ఘటనలు కూడా నియంత్రణరేఖ వద్ద వున్న మిచిల్ సెక్టార్‌లోనే జరిగాయి. తాజాగా మొన్న కృష్ణఘటి సెక్టార్‌లో ఇద్దరు సైనికులను అదేవిధంగా హతమార్చి రాక్షసానందం పొందారు. ఈ ఏడాది ఇప్పటికే 65 సార్లు పాక్ బలగాలు కాల్పుల ఉల్లంఘనకు పాల్పడ్డాయంటే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా వుందో తేటతెల్లమవుతోంది. ఒక్క ఏప్రిల్ నెలలోనే జమ్ము కాశ్మీర్‌లోని నియంత్రణరేఖ వెంబడి పాక్ సైన్యం ఏడుసార్లు కాల్పుల ఉల్లంఘనలకు పాల్పడింది. 2014లో 150 సార్లు, 2015లో మరో 150 సార్లు, 2016లో 228 సార్లు పాక్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇన్నిసార్లు అతిక్రమణలు చేస్తున్నా భారత్ నిబ్బరంగా చూస్తూనే వుంది.

సైనికుల మృతదేహాలను ఛిద్రం చేసే అత్యంత పైశాచికమైన ఘటనలు భయంకరమైన యుద్ధాల్లో సైతం వుండవు. అలాంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్న పాక్‌కు తగు శాస్తి తప్పదని, అందుకు బదులు తీర్చుకుంటామని భారత్ స్పష్టం చేస్తోంది. పాక్ మళ్ళీ ఇలాంటి దుశ్చర్యలకు దిగకుండా గుణపాఠం చెప్పాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి. ఒకవైపు కశ్మీర్‌లోయలో ఆందోళనల మంటలు పెట్టి చోద్యం చూస్తూనే, మరోవైపు సరిహద్దుల్లో జవాన్లపై అమానుషత్వాలకు.. అకృత్యాలకు పాల్పడుతూ పాక్ తన దుష్టనీతిని చాటుకుంటోంది. ఉగ్రవాదానికి పుట్టినిల్లయిన పాక్, ఉగ్రవాదులను భారత్‌లోకి పంపి మారణహోమాలు సృష్టించడం ద్వారా భారత్‌ను అడుగడుగునా భయపెట్టాలని చూస్తూనే వుంది. భారత్‌ను కష్టాల్లోకి నెట్టడమే పనిగా పెట్టుకుని చేస్తున్న పాక్ దుశ్చర్యలకు భారత్ ఏనాడూ భయపడదని తెలిసినా, పాక్ అనునిత్యం దుష్కృత్యాలను కొనసాగిస్తూనే వుంది. ఇకనైనా భారత్‌పై అమానుషత్వాలు మానకుంటే..చివరికి నష్టపోయేది తానేనన్న విషయాన్ని పాక్ తెలుసుకోవాల్సి వుంది.

## వనంతోపు సెంటర్‌లో క్రికెట్ అకాడమీ



నెల్లూరు నగరంలోని వనంతోపు సెంటర్‌లో ఆదివారం ఫ్యూచర్‌స్టార్స్ క్రికెట్ అకాడమీ ప్రారంభమైంది. ఈ అకాడమీని శాప్ డైరెక్టర్ రవీంద్ర బాబు ప్రారంభించారు. జిల్లాలో క్రికెట్ క్రీడాకారులకు కొదవలేదని, ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దే సంకల్పంతో ఇక్కడ క్రీడాకారులకు నెట్ ప్రాక్టీస్‌కు అనువైన వసతులు కల్పించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి డి. శ్రీనివాసరెడ్డి, కార్యవర్గసభ్యులు కొణిదెల మునిగిరీష్, స్థలదాత కొళ్ళపూడి శ్రీనివాసులురెడ్డి, నిర్వాహకులు విష్ణువర్ధన్‌కుమార్, ఎన్ఐఎస్ క్రికెట్ కోచ్‌లు గిరిరాయల్, రాజకృష్ణ, కె. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

నెల్లూరు, నర్తకి థియేటర్ సమీపంలో స్థానిక బలిజ ఉద్యోగ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రం ప్రారంభోత్సవానికి విచ్చేసిన టిడిపి నాయకురాలు తాళ్ళపాక అనూరాధ, మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజల దాహార్తి తీర్చడం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. సేవాసమితి అధ్యక్షుడు అనిల్, కార్యదర్శి ఎస్.చక్రధర్, సంయుక్త కార్యదర్శి శ్రీను, నాగేశ్వరరావు, పగడాల మల్లి, శశి, శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## లలితమ్మ సేవలు మరువలేనివి

### వక్తల ప్రశంస

తన కోసం, తన కుటుంబం కోసం కాకుండా అందరికీ విద్య కావాలని, మహిళలంతా చదువుకోవాలని డాక్టర్ వకుళాభరణం లలితమ్మ ఎంతగానో తపించేవారని, లలితమ్మ సేవలు మరువలేనివని వక్తలు ప్రశంసించారు. ఆదివారం నెల్లూరులోని డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాలలో డాక్టర్ వకుళాభరణం లలితమ్మ సంస్మరణ సభ జరిగింది. ఈ సభలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి పాల్గొని లలితమ్మ సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. లలితమ్మ ఆశయాలు ఆదర్శప్రాయమన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డా.కాళిదాసు పురుషోత్తం, ప్రజాసైన్స్ వేదిక నాయకురాలు సి.శారద, ఐద్వా నాయకురాలు పి. విజయమ్మ, ఆచార్య ఆదిత్య, సుకుమార్‌రెడ్డి, హనుమంతరావు, ఎస్‌కె షాహినాబేగం, అరిగెల రమమ్మ, ఎస్‌కె మస్తాన్‌బీ, పి.శ్రీరాములు, ప్రభాకర్, ఎస్‌కె గుల్జార్, డి. అన్నపూర్ణమ్మ, ఎన్.ఆదిలక్ష్మి, జి.శ్యామలమ్మ, ఎం.కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.




## విఐపి కల్చర్ పోతుందా?

కార్లమీద బుగ్గలైట్లు తీయగానే విఐపి కల్చర్ పోతుందా? ఒకవేళ కార్లమీద అది ఉన్నంత మాత్రాన ప్రజలకు వస్తున్న నష్టం ఏమీలేదు. విఐపి సంస్కృతి అంతం కావాల్సింది సేవలు ఉపయోగించుకునే విషయంలో! ముందు దేవాలయాలలో విఐపి సంస్కృతి పోవాలి. తిరుమలలో ప్రత్యేక విఐపి దర్శనాలు నిలిపేసి అందరికీ ఒకే విధమైన దర్శనం కల్పించాలి. ఆయా సంస్థలలో విఐపిలకు కల్పించే సదుపాయాలను రద్దు చేయాలి. బస్సుల్లో, రైళ్లల్లో విఐపిల కోటా లేకుండా చేయాలి. అప్పుడే విఐపి కల్చర్ కొంతన్నా తగ్గుతుంది.

– కె.మహేష్‌రాయల్, తిరుపతి.

## ఓట్ల కోసం రిజర్వేషన్లు

తెలంగాణలో ముస్లింలకు 12శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ కేసీఆర్ చట్టం తెచ్చాడు. మతపరమైన రిజర్వేషన్లే భారత దేశంలో లేవు. స్వాతంత్ర్యం రాకముందు ఆరేడు వందల ఏళ్ల పాటు ఈ దేశాన్ని ఏలింది ముస్లింలు, క్రిస్టియన్‌లే! వారి పాలనలో అన్ని విధాలా అన్యాయానికి గురైంది హిందువులే! అప్పుడు రిజర్వేషన్లు ఎవరికుండాలి! అసలు మతాల పరంగా రిజర్వేషన్లు కాదు, జనాభా దామాషా ప్రకారం ఆయా కులాలకు రిజర్వేషన్లు ఇవ్వండి. తక్కువ శాతం ఉండే మైనార్టీల ఓట్ల కోసం రిజర్వేషన్లు అమలు చేస్తారు. మరి అత్యధిక శాతం ఉండే అగ్రవర్ణ పేదల కోసం మాత్రం ఏమీ చేయరు. రాజకీయ పదవుల్లో కూడా ఇదే రిజర్వేషన్ విధానాన్ని అమలు చేయండి. అసలు తెలంగాణ సీఎం పదవినే ఎస్సీలకో, ముస్లింలకో ఇచ్చి ఉండొచ్చు కదా! కేసీఆర్‌కు ఆ పదవెందుకు, రాజకీయ పదవుల్లో మాత్రం రిజర్వేషన్లు ఉండకూడదు. అగ్రవర్ణ పేదల కడుపు కొట్టి ఓట్ల కోసం ఇతరులకు మాత్రం రిజర్వేషన్లు ఇవ్వొచ్చు. ఇదేం నీతి చంద్రశేఖరా?

సి.రాజీవి, నెల్లూరు.

## రోడ్లు ధ్వంసం

భూగర్భ డ్రైనేజీ పేరుతో నెల్లూరు నగరంలో రోడ్ల విధ్వంసం చూస్తుంటే బాధేస్తుంది. కొన్ని వందల కోట్ల రూపాయల రోడ్లు నాశనం అవుతున్నాయి. నగరంలో ఏ రోడ్డూ శుభ్రంగా లేకుండా పోయింది. రోడ్లు వేయకముందే ఇలాంటి పనులు చేసివుండాలి. లేదంటే సిమెంట్ రోడ్ల బదులు తారురోడ్లన్నా వేయాలి.

ఎల్.నాగేశ్వరరావు, నెల్లూరు.

## నెరవేరని హామీలొద్దు

కొండ మిరపకాయ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యవసాయ మంత్రి అయిన తర్వాత మాగాణి సేద్యంతో పాటు మెట్ట సేద్యం చేస్తున్నారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీని తెరిపించడం, దుగరాజపట్నం పోర్టు నిర్మించడం వంటి వాగ్దానాలు చేస్తున్నారు. పక్కనే కృష్ణపట్నం పోర్టు ఉంటే దుగరాజపట్నం పోర్టుతో పనేముంది. నెరవేరని వాగ్దానాలకంటే రైతులకు, జిల్లా ప్రజలకు ప్రయోజనం కలిగించే కార్యక్రమాలపై ఆయన దృష్టిపెట్టాలి.

– వాస్తు రామచంద్ర, నెల్లూరు.

# రియల్టర్ల గుండెల్ గు'బిల్లు'

## • విచ్చలవిడి వ్యాపారాలకు చెల్లు

**అసలే కాల్లో ముల్లు గుచ్చుకుని నక్క మూలుగుతూ తాటి చెట్టు క్రిందికొచ్చింది... అప్పుడే దాని నెత్తిన తాటికాయ పడింది. ఇంకా మూలుగు పెంచి నీరసంగా ఇంకో చోటకు చేరింది. అప్పుడే భారీ ఈదురు గాలి వచ్చి ఎండిన చెట్టు ఒకటి కూలి దాని మీద పడింది. నక్క చచ్చింది. నెల్లూరుజిల్లాలో రియల్టర్లకు ఈ నక్కకు అలాంటి పోలికే వుంది.**



2004కు ముందు నెల్లూరు జిల్లాలో రియల్‌ఎస్టేట్ ఒక వ్యాపారం లాగానే జరిగేది. 2004 నుండి రియల్ ఎస్టేట్ స్వరూపమే మారిపోయింది. వై.యస్. హయాంలో జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి కొత్తపుంతలు తొక్కడంతో రియల్ వ్యాపారం వెర్రితలలు వేసింది. జిల్లా నిండా రియల్టర్లు, మీడియేటర్లు తయారయ్యారు. తొండలు గుడ్లు పెట్టని భూములు కూడా లక్షలు, కోట్లకు చేరాయి. 2009లో కృష్ణపట్నం పోర్టు ప్రారంభోత్సవానికి సోనియాగాంధీ వచ్చేదాకా కూడా రియల్ వ్యాపారం కళ్లెం లేని గుర్రంలా పరుగులు తీసింది. సోనియా వచ్చి వెళ్లాక రియాల్టీలో మందకొడితనం మొదలైంది. 2009 సెప్టెంబర్‌లో వై.యస్. చనిపోవడం జిల్లాలో రియల్ ఎస్టేట్‌ను కోలుకోలేని దెబ్బ తీసింది. 2014 దాకా కూడా ఈ జిల్లాలో రియల్‌ఎస్టేట్ లేవలేదు. 2014లో జగన్ ముఖ్యమంత్రి అయ్యుంటే ఈ జిల్లాలో రియల్టర్లు పండుగ చేసుకుని ఉండేవాళ్లు. ఎందుకంటే ప్రకాశం జిల్లాలో రాజధాని వచ్చుండేది. దాని ప్రభావం ప్రధానంగా నెల్లూరు మీదే వుండేది కాబట్టి రియల్ బూమ్ వచ్చుండేది. కాని జగన్ కాకుండా చంద్రబాబు సీఎం కావడంతో నెల్లూరు జిల్లా రియల్టర్ల దరిద్రం పరాకాష్టకు చేరింది. గత మూడేళ్లుగా జిల్లాలో రియల్ వ్యాపారం అన్నది లేదు. రియల్టర్లు తెచ్చిన అప్పులు కట్టలేక, వేసిన లే అవుట్లలో ప్లాట్లను అమ్ముకోలేక నానా పాట్లు పడుతూ చావలేక బ్రతకలేకపోతున్న తరుణంలో పెద్దనోట్ల రద్దు ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ చావుదెబ్బ కొట్టాడు. పెద్దనోట్ల రద్దుతో రియల్ ఎస్టేట్ పూర్తిగా పడుకుంది. ఇక రియల్ ఎస్టేట్‌కు భవిష్యత్ లేదని గ్రహించిన చాలామంది వ్యాపారులు, ఇతర రంగాలవైపు దృష్టి సారిస్తున్నారు.

ఈ దశలోనే కేంద్రం రియల్‌ఎస్టేట్ అథారిటీ బిల్లును తీసుకొచ్చి రియల్టర్ల నెత్తిన వంద పిడుగులను ఒకేసారి వేసింది. ఈ బిల్లుతో రియల్ మార్కెట్ నుండి చాలామంది రియల్టర్లు ఔట్ అయి పోవాల్సిందే! డూప్ సరుకంతా పోయి ఒరిజినల్ మాత్రమే మిగులుతుంది. కాకపోతే రియల్‌ఎస్టేట్ మార్కెట్ మొత్తం కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోతుంది. రైతుల భూముల ధరలను నిర్ణయించే అధికారం సైతం పరోక్షంగా కార్పొరేట్ కంపెనీల చేతుల్లోనే ఉంటుంది. ఇంతకాలం జరిగిన మార్కెట్‌లో పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీలతో పాటు చిన్నాచితకా రియల్టర్లు కూడా మనుగడ సాగిస్తూ వచ్చారు.

కోటి రూపాయలు చేతిలో వుంటే ఇంకో నాలుగుకోట్లు అప్పు చేయడం, రైతుల నుండి డెవలప్‌మెంట్ ప్రక్రియ క్రిందనో, లేదా కొన్ని నెలలు గడువులోగా పూర్తి మొత్తం చెల్లించే విధానంగానాని భూములను తీసుకుని లే అవుట్లు వేస్తూ ఓ పక్క ప్లాట్లు అమ్ముకుంటూనే మరోపక్క వచ్చిన అడ్వాన్స్‌లతో లేఅవుట్ డెవలప్‌మెంట్ చేసుకునేవాళ్లు. ఇంట్లో కోట్లు లేకపోయినా ఒంట్లో శక్తి, తలలో తెలివున్నోళ్లు ఈ ప్రక్రియలో వ్యాపారం చేసుకుంటూ అభివృద్ధి చెందారు. ఇలాంటి చిన్న వ్యాపారులు అధికంగా ఉండబట్టే రైతుల భూములకు విపరీతంగా ధరలొచ్చాయి. కాని ఇప్పటి బిల్లు చిన్న వ్యాపారులకు గుదిబండగా మారింది. బిల్లులో వున్న నిబంధనలకు అనుగుణంగా రియల్‌ఎస్టేట్‌లో నిలబడడం చిన్న వ్యాపారులకు సాధ్యం కాదు. కాబట్టి భవిష్యత్ రియల్‌మార్కెట్ అంతా కూడా పెద్ద కంపెనీలదే!

# 'నుడా'పై ఎవరి అంచనాలు వారివే!



తెలుగుదేశం పార్టీలో ఇంతవరకు జరిగిన పదవుల పందేరం ఓ లెక్క... ఇకముందు జరగబోయే పదవుల పందేరం ఓ లెక్క! ఇప్పటివరకు కులసమీకరణలోనో, లేక సీనియార్టీ మీదనో, లేక పిలవగానే అవతల పార్టీల నుండి పరుగెత్తుకుంటూ వచ్చారనో పదవులిస్తూ వచ్చారు. కాని ఇక నుండి ఇవ్వబోయే పదవులు మాత్రం రానున్న ఎలక్షన్ కోణంలోనే వుంటాయి. ఆ పదవుల పంపిణీ వెనుక ఓట్ల లెక్కలుంటాయి. ఒకరికి ఈ పదవి ఇచ్చిన దానివల్ల కనీసం ఎన్ని ఓట్లు పార్టీకి అదనంగా వస్తాయనే ఆలోచనలు ఉంటాయి. రేపు 'నుడా' ఛైర్మెన్ పదవిని కూడా అదే కోవలో ఇవ్వబోతున్నారు.

'నుడా' పదవికి ప్రస్తుతం అనూరాధ, డాక్టర్ జడ్.శివప్రసాద్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దేశాయిశెట్టి హనుమంతరావుల పేర్లు ప్రముఖంగా ప్రచారంలో ఉన్నాయి. ఈ జిల్లా రాజకీయాలలో కుల సమీకరణలు బట్టి కూడా పదవులను ఇవ్వాల్సి ఉంటుంది. రాజకీయంగా రెడ్లు, బి.సిలకు అధిక ప్రాధాన్యతనివ్వాల్సి వుంటుంది. ఈ జిల్లా నుండి చూస్తే కాపుల తరపున ఒక మంత్రి ఉన్నారు. ఇక పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బి.సి వర్గాలకు చెందిన నాయకుడున్నారు. ఇక పార్టీని రెడ్లకు చేరువ చేయాలనే దృష్టితో ఇటీవలే ఆ వర్గానికి చెందిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి కేబినెట్‌లో స్థానం కల్పించడం జరిగింది. రెడ్లను పార్టీవైపు లాక్కునే కనీస ప్రయత్నం ఇది.

ఇప్పుడు జిల్లా టీడీపీ రాజకీయాలలో ఒకటే లాజిక్! రెడ్లు దగ్గరైతే పార్టీ బలపడుతుంది. బీసీలు దూరమైతే పార్టీ బలహీనపడుతుంది. 'రెడ్ల'కు నుడా ఇచ్చినంత మాత్రాన ఆ వర్గాలకు చెందిన ఓట్లు వస్తాయన్న గ్యారంటీ ఇక లేదు. కాని, ఇప్పటికే కాపు రిజర్వేషన్లను కలబెట్టి ఉండడంతో బి.సిలలో అసంతృప్తి మొదలైంది. రేపు నామినేటెడ్ పదవుల విషయంలో కూడా బి.సిలకు తగిన ప్రాధాన్యతనివ్వకపోతే కొత్త ఓట్లు రావడం మాట దేముడెరుగు పార్టీకి ఉన్న ఓట్లు పోయే అవకాశముంది. కాబట్టి పార్టీకి ఓట్లు సమకూర్చే దిశగా 'నుడా' ఛైర్మెన్ ఎంపిక ఉండబోతోంది.



# ఆగస్టుకు బ్యారేజీ పనులు పూర్తి

ఈ ఏడాది ఆగస్టు నాటికి పెన్నా, సంగం బ్యారేజీ పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం నెల్లూరు పెన్నా బ్యారేజీని పరిశీలించిన మంత్రి ఇంకా పూర్తి చేయాల్సిన పనులపై తెలుగుగంగ అధికారులను అడిగి తెలుసుకున్నారు. 15లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ రెండు బ్యారేజీల పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి నీటి పారుదల పర్యవేక్షణ ఇంజనీర్లను ఆదేశించారు. నగర మేయర్ అబ్దుల్ అజీజ్, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# ఇస్తారా? ఇవ్వరా?

## సీఎంతో ఆనం సోదరుల భేటీ



తెలుగుదేశంపార్టీలో చేరినప్పటి నుండి కూడా మనశ్శాంతి కరువై, పూలమ్మిన చోటే కట్టెలమ్ముకున్నట్లుగా వున్న ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలు 2వ తేదీ సీఎం చంద్రబాబును కలిసారు. జిల్లా రాజకీయాల గురించి కాకుండా తమ రాజకీయ భవిష్యత్ గురించి ఆయనతో చెప్పుకున్నారు. ఆనం సోదరులు తెలుగుదేశంలో చేరారనేగాని, పార్టీలో వీరికి సరైన ప్రాధాన్యత లేదు. కాంగ్రెస్‌లో రాజాలు మాదిరిగా ఏలిన ఈ బ్రదర్స్‌కు తెలుగుదేశంలో ఇమడడం కష్టంగానే వుంది. అయినా రాజకీయంగా ఇంకో ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో తెలుగుదేశంనే అంటి పెట్టుకుని వున్నారు. పార్టీలో చేరాక ఆనం రామనారాయణరెడ్డికి ఆత్మకూరు ఇన్‌ఛార్జి ఇవ్వడం తప్పించి ఇంకేమీ చేయలేదు. ఆనం సోదరులు ఎమ్మెల్సీ డిమాండ్ చేస్తున్నారు. దానిపై చంద్రబాబు ఇంతవరకు హామీ ఇవ్వలేదు. త్వరలో గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీ సీట్లు భర్తీ చేయాలి. వీటిలో ఒక దానిని జమ్మలమడుగు రామసుబ్బారెడ్డికి ఇచ్చారు. కాబట్టి రెండో ఎమ్మెల్సీని రెడ్లకు ఇవ్వలేదు. దీంతో ఇప్పట్లో ఆనం సోదరులకు ఎమ్మెల్సీ అవకాశం లేనట్లే! కాని నిన్న సీఎంను కలిసిన బ్రదర్స్, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీని అడిగినట్లు తెలుస్తోంది. తమకు ఏదో ఒక పదవి వుంటేగాని పార్టీలో తమ ప్రాధాన్యత పెరగదని వారి ఉద్దేశ్యం. ఒకవేళ ఎమ్మెల్సీ ఇవ్వలేని పక్షంలో 'నుడా' ఛైర్మెన్‌తోనైనా సర్దుకుపోవడానికి బ్రదర్స్ సిద్ధంగా వున్నట్లు, ఆ విధంగా చంద్రబాబుకు సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

# ఇళ్లను త్వరగా కట్టండి



గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణంలో వున్న గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అధికారులను ఆదేశించారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం సైదాపురం మండలంలోని చాగణం గ్రామంలో ఆయన రాత్రి బస చేశారు. రాత్రి బస అనంతరం మంగళవారం ఉదయం వెంకటగిరి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత డక్కిలి మండలం పాతనాలపాడు గిరిజన కాలని, దేవులవడ్డిపల్లి బి.సి కాలనీలలో, డక్కిలి ఎస్.సి కాలనీలలో, గృహనిర్మాణ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్మాణంలో వున్న గృహాలను ఆయన పరిశీలించారు. దేవుల వడ్డిపల్లి గ్రామంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న అంగన్‌వాడి భవనాలను పరిశీలించారు. అనంతరం డక్కిలి జడ్పీ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కలెక్టర్ వెంట వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, గృహనిర్మాణ శాఖ పి.డి రామచంద్రారెడ్డి, అధికారులు ఉన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## అభినందన



ఏప్రిల్ 29వ తేదీన హైదరాబాద్‌లో దంపతులైన ప్రజిత్ - సింధూరలను మే 3వ తేదీ బుధవారం మాగుంట లే అవుట్‌లోని తుంగా శివప్రభాత్‌రెడ్డి స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు, పక్కనే రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం

# ప్రతి కుటుంబానికీ మినరల్ వాటర్



ఈ నెల 4వ తేదీన నెల్లూరు జెండా వీధి సెంటర్‌లో స్థానిక కార్పొరేటర్ ఎం.డి.ఖలీల్‌అహ్మద్, వైసిపి సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కె.మీరామొహిద్దీన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ చలివేంద్రాన్ని నగర ఎమ్మెల్యే డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ నగరంలో ప్రతిఒక్కరూ ఇటువంటి కార్యక్రమాలు చేపట్టి, ప్రజలకు స్వచ్ఛమైన నీళ్ళు అందించాలని సూచించారు. ఈ డివిజన్‌లో మినరల్ వాటర్‌ప్లాంటును ఏర్పాటు చేస్తున్నామని, అతిత్వరలోనే దీనిని ప్రారంభించి 2రూపాయలకే 20లీటర్ల స్వచ్ఛమైన నీటిని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఫజల్ అహ్మద్, సమీముల్లా, రియాజ్, ఎస్‌కె అహ్మద్‌బాషా, మున్వర్, ఆషిఫ్, రవూఫ్, నాసర్, ముస్తాక్‌అహ్మద్, రబ్బా, సమద్, ఫయాజ్, శివం, సురేష్ పాల్గొన్నారు.

## అమరుడైన అనిల్



నెల్లూరు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటి సభ్యులు, ఏబివిపి ప్రముఖ నాయకుడు బెజవాడ అనిల్‌కుమార్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున చెన్నైలోని గ్లోబల్ ఆసుపత్రిలో మృతి చెందారు. ఈయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్యసేవల కోసం అనిల్‌కుమార్‌రెడ్డి తన వంతు కృషి చేశారు. విధులకు రాని వైద్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల మద్దతుకూడగట్టి విఆర్సీ సెంటర్‌లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈయన మృతికి ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహ రావు, సభ్యులు ఒట్టూరు సంపత్‌రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, ఏబివిపి నాయకులు తమ సంతాపాన్ని తెలియజేశారు.

## ముగిసిన జగద్గురు ఆదిశంకర జయంత్యుత్సవాలు



నెల్లూరు శ్రీ పినాకినీ విద్యాపీఠం ఆధ్వర్యంలో నెల్లూరు ట్రంకురోడ్డులోని టివిఎన్ కళ్యాణ మండపంలో గత నెల 30వ తేదీ నుండి ప్రారంభమైన 71వ జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య జయంతి ఉత్సవాలు ఈ నెల 4వ తేదీతో వైభవంగా ముగిసాయి. ఈ సందర్భంగా ప్రతిరోజు ఉదయం మహాన్యాసపూర్వక ఏకాదశ పూర్ణవారాభిషేకాలు, లలిత, విష్ణు, శివశంకరాచార్య అర్చనలు, రాజమండ్రి వాస్తవ్యులు బ్రహ్మశ్రీ పిడపర్తి వేంకటపూర్ణ శివరామశర్మ, మచిలీపట్నం వాస్తవ్యులు బ్రహ్మశ్రీ విష్ణుబొట్ల షణ్ముఖశర్మచే నిర్వహించారు. వేద పారాయణ, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం ప్రదోషకాలపూజ, లలిత విష్ణు సహస్ర నామస్తోత్ర పారాయణ, లబ్ధప్రతిష్టులైన వేదపండితులచే నిర్వహించారు. గత నెల 30వ తేదీన 16సంవత్సరాలలోపున్న 5మందికి ఉచిత ఉపనయనాలు జరిపించారు. గత నెల 30, ఈ నెల 1వ తేదీ బ్రహ్మశ్రీ డా॥ చిర్రావూరి శ్రీరామశర్మ శ్రీ శంకరులవారి స్తోత్రవాఙ్మయం, అద్వైత విషయాలపై ఉపన్యసించారు. 2వ తేదీ, 3వ తేదీ బ్రహ్మశ్రీ డా॥ ధూళిపాళ మహదేవమణి శంకరులు – పరదేవతా ప్రతిష్ఠ అంశంపై ఉపన్యసించారు. 4వతేదీ బ్రహ్మశ్రీ డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్ మనస్సాక్షి మహాభారతం – అద్వైత బోధ అంశంపై ఉపన్యసించారు. గురువారం ఉదయం 10 గంటల నుండి వేదసభ – మహాదాశీర్వచనపై ఋగ్వేదం గురించి బ్రహ్మశ్రీ వట్టిపల్లి కాశీవిశ్వనాథశర్మ, బ్రహ్మశ్రీ వల్లకవి జ్ఞాన పరాశరరావు శర్మ, యజుర్వేదం గురించి బ్రహ్మశ్రీ మడనూరు చంద్రశేఖరశర్మ, బ్రహ్మశ్రీ అవ్వారి రామకృష్ణశర్మ, సామవేదం గురించి బ్రహ్మశ్రీ పప్పు శ్రీకాంత్‌శర్మ, బ్రహ్మశ్రీ పెండ్యాల అవినాష్‌కుమార్ శర్మ, అధర్వణ వేదం గురించి బ్రహ్మశ్రీ యల్లాప్రగడ హేమదుర్గా పవనకుమార శర్మ, బ్రహ్మశ్రీ కోటా అనూష్‌కుమార్‌శర్మలు ఉపన్యసించారు. అతిథులందరినీ పినాకిని విద్యాపీఠం పక్షాన సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. పీఠం అధ్యక్షులు స్వయంపాకుల శ్రీనివాసులు, కార్యనిర్వహణాకార్యదర్శి చక్రాల వెంకటలక్ష్మీ నరశింహం, కార్యదర్శి దూబగుంట ప్రభాకరరావు, కార్యవర్గసభ్యులు పర్యవేక్షించారు.

# కాంగ్రెస్‌కు కేతంరెడ్డి రాంరాం!



నెల్లూరు నగరంలో ఇన్వెంటివ్ యాడ్స్ వినోద్‌గా అందరికీ సుపరిచితుడైన యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి 3వ తేదీ కాంగ్రెస్‌పార్టీకి, తన పదవికి రాజీనామా చేశాడు. కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీకి ఆయన తన రాజీనామా లేఖను పంపించాడు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు ఆయన ఆ లేఖలో పేర్కొన్నాడు. కాగా విపిఆర్ ఫౌండేషన్ అధినేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేస్తున్న సేవాకార్యక్రమాలలో పూర్తి స్థాయిలో పాల్గొనడం కోసమే వినోద్ ఈ రాజకీయ మాస్క్‌ను తొలగించుకున్నట్లుగా తెలుస్తోంది.

ఫ్లెక్సీ డిజైన్‌లను అద్భుతంగా చేస్తాడన్న పేరున్న వినోద్ ఆ దిశలోనే మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డికి బాగా దగ్గరయ్యాడు. ఆయన ప్రోత్సాహంతోనే కాంగ్రెస్‌పార్టీలో చేరాడు. 2003లో ఎన్‌ఎస్‌యుఐలో చురుకుగా పని చేసాడు. 2008లో కాంగ్రెస్ జిల్లా ప్రచారకమిటీ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు చేపట్టాడు. 2012లో జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, 2014లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేశాడు. 2015లో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్‌గా పనిచేస్తూ జాతీయ నాయకుల కంట్లో కూడా పడ్డాడు. 2016లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నియమితుడయ్యాడు. ఈ జిల్లాలో మహా మహులే కాంగ్రెస్‌ను వదిలి వెళ్లినా వినోద్ వదిలి వెళ్లలేదు. పార్టీకి ఎవరూ దిక్కులేని రోజుల్లో కూడా పార్టీ పరంగా జిల్లాలో చాలా కార్యక్రమాలు అతనే నిర్వర్తించాడు. నెల్లూరు రోడ్లను ధ్వంసం చేయొద్దని, హడ్కో అప్పు పేరుతో ప్రజలపై పన్నుల భారం మోపొద్దంటూ నెలరోజుల పాటు నెల్లూరురోడ్లపై పాదయాత్ర నిర్వహించాడు. కాంగ్రెస్‌ను అతను వదిలిపోడని అందరూ భావించారు. అయితే కాంగ్రెస్‌కన్నా విపిఆర్ సేవా కార్యక్రమాలలో పాల్గొనడమే తనకు ప్రధానమని భావించిన వినోద్ కాంగ్రెస్‌కు బైబై చెప్పాడు.

# సోమిరెడ్డితో వివేకా భేటి



ఒకే పార్టీలో ఉంటున్నప్పటికీ ఇంకా పూర్తిగా మనసులు కలవని నాయకులుగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం వివేకాకు పేరుంది. వేర్వేరు పార్టీలలోవున్నా, ఒకే పార్టీలో వున్నా రాజకీయంగా ఒకేస్థాయి నాయకులు కాబట్టి రాజకీయంగా ఇద్దరి మధ్య విభేదాలు సాధారణమే! రాజకీయాలను తీసి పక్కనపెడితే మిగతా విషయాలలో ఇద్దరూ చాలా ఫ్రెండ్లీగా వుంటారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సోమిరెడ్డి నెల్లూరులో వివేకా ఇంటికి పోయి ఆయనతో ముచ్చట్లుపెట్టుకుని వచ్చాడు. అట్లాగే అమరావతిలో సీఎం చంద్రబాబును కలవడానికి వెళ్లిన వివేకా అదేపనిగా 3వతేదీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఛాంబర్‌కు వెళ్లి గంటన్నర పైగా ఆయనతో మంతనాలు జరిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర కూడా వెళ్లి వారి మధ్య ముచ్చట్లలో పాలుపంచుకున్నాడు.

# నరసింహకొండ బ్రహ్మోత్సవాలు

నెల్లూరురూరల్ మండలం నరసింహకొండపై వెలసిన శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 4వ తేదీన అంకురార్పణతో మొదలయ్యాయి. ఉత్సవాలలో భాగంగా 5వ తేదీ ఉదయం ధ్వజారోహణం, రాత్రి శేషవాహన సేవ, 6వ తేదీ రాత్రి హంస వాహన సేవ, 7వ తేదీ రాత్రి సింహవాహన సేవ, 8వ తేదీ సాయంత్రం పూలంగిసేవ, రాత్రి హనుమంతుసేవ, 9వ తేదీ మధ్యాహ్నం మోహినీ ఉత్సవం, రాత్రి బంగారు గరుడసేవ, 10వ తేదీ సాయంత్రం కళ్యాణోత్సవం, 11వ తేదీ రథోత్సవం, 12వ తేదీ రాత్రి అశ్వవాహనసేవ, 13వ తేదీ రాత్రి ధ్వజావరోహణ జరుగనున్నాయి. 14వ తేదీ రాత్రి ఏకాంత సేవతో తిరునాళ్లు ముగుస్తాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని, భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించి తరించాలని ఆలయ ఇ.ఓ ఏ.వి. శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో కోరారు.



# తృతీయ వర్ధంతి



జననం
09.09.1964

మరణం
06.05.2014

మా ఇంటి ఆశాదీపం

## జక్కా రామ్‌మోహన్‌రెడ్డి

పరమపదించి తే. 6.5.2017ది నాటికి మూడు సంవత్సరాలు గడుస్తాయి.

*వారి దివ్యస్మృతిలో...*

నానమ్మ : **జక్కా కామేశ్వరమ్మ**

నాన్న : **జక్కా కోదండరామిరెడ్డి**
మాజీ శాసనసభ్యులు

అమ్మ : **జక్కా సులోచనమ్మ**

భార్య : **జక్కా వినుజరెడ్డి**

కుమార్తె : **జక్కా రిధిరెడ్డి**

కుమారుడు : **జక్కా మనవ్‌రెడ్డి**

తమ్ముడు : **జక్కా జనార్ధన్‌రెడ్డి**

మరదలు : **జక్కా స్మితరెడ్డి**

తమ్ముని కుమారుడు : **జక్కా కోదండ శ్రీవత్స**

చెల్లెలు : **పద్మజ**

బావ : **ఎ.బి.వి.రమణారెడ్డి**

చెల్లెలి కుమార్తెలు : **ప్రియదర్శిని వెంకట్, యామిని వెంకట్**

**తృతీయ వర్ధంతి :** తే.6.5.2017ది శనివారం హైదరాబాద్, జూబ్లీహిల్స్, యం.యల్.ఎ కాలనీలోని వారి స్వగృహమునందు జరుగును.

## కల్యాణ వైభవం...!



గూడూరు నెల్‌క్యాస్ట్ లిమిటెడ్ మేనేజర్(పి.ఆర్) మరియు 'లాయర్' వారపత్రిక గూడూరు డివిజన్ ఇన్‌ఛార్జి ఆనిమెళ్ళ శివకుమార్ - రాజేశ్వరీదేవిల కుమారుడు **వెంకట శరత్‌కుమార్ - నాగజ్వాల ప్రవళిక** (గూడూరు వాస్తవ్యులు వెల్లటూరి సుదర్శనరావు - చంద్రికల కుమార్తె))ల వివాహం ఏప్రిల్ 28వ తేదీ గూడూరు పివిఆర్ కళ్యాణ మండపంలో అత్యంత వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.

# ప్రజాసమస్యలు పరిష్కరించండి



ఆర్డీవోతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

## గూడూరు డివిజన్ వార్తలు

పేదల సమస్యలు పరిష్కరించేలా వెంటనే చొరవ చూపాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో అరుణ్‌బాబును కలిసి ప్రజల సమస్యలు, గూడూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు రెవెన్యూ అధికారులు నోటీసులు పంపిన విషయంపై సోమవారం చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల విషయంలో ఎలాంటి అన్యాయం జరగకుండా తగిన న్యాయం జరిగేలా చూడాలని ఆర్డీవోకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఏఎంసి ఛైర్మెన్ బొల్లినేని కోటేశ్వరరావు, కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో ముగ్గురు అరెస్ట్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్

మండల కేంద్రమైన సైదాపురం గ్రామానికి చెందిన కొప్పు వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని కిడ్నాప్ చేసి హత్య చేసిన ఘటనలో మంగళవారం ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి నాలుగు బంగారు ఉంగరాలు స్వాధీనం చేసుకున్నట్లు గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ తెలిపారు. గూడూరు డిఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఈ కిడ్నాప్‌కు సంబంధించిన వివరాలను విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. గత ఎన్నికల సమయంలో కోటిరూపాయలు కొందరికి దొరికాయన్న వదంతులొచ్చాయి. ఈ క్రమంలోనే గతంలో ఒక సర్పంచ్‌ని సైతం కిడ్నాప్ చేసి వదలివేశారు. సైదాపురానికి చెందిన కొప్పు వెంకటేశ్వర్లుకు నగదు దొరికిందన్న అపోహతో గతంలో పలు పర్యాయాలు స్థానికులు బెదిరింపులకు పాల్పడ్డారు. కిడ్నాప్ చేయాలని పథకం వేశారు. ఈ క్రమంలో గత నెల 26వ తేదీ వెంకటేశ్వర్లు పనులకు వెళ్లి వస్తున్న సమయంలో మధ్యాహ్నం 2.30గంటల సమయంలో సైదాపురం గ్రామానికి చెందిన బగ్గ రూపేష్‌కుమార్ ఇచ్చిన సమాచారంతో పాకనాటి రోహిణికుమార్, చాగణంకు చెందిన మేకల బోదేష్, మేకల శ్రావణ్‌కుమార్ స్కార్పియో వాహనాన్ని గూడూరులో గోవాకు వెళ్తున్నట్లు బాడుగకు తీసుకొనివెళ్లి వెంకటేశ్వర్లును ముసుగులు ధరించి కిడ్నాప్ చేశారు. దొరికిన డబ్బు ఇవ్వాలని బెదిరించారు. ముసుగులో వున్న తమని గుర్తుపడితే గుట్టు రట్టవుతుందన్న ఆలోచనతో వాహనంలోనే తిరుపతి ప్రాంతంలో ఉండి, అనంతరం అక్కడి నుంచి కడపజిల్లా చిట్వేలు సమీపంలోని అటవీ ప్రాంతంలో గుండాలకోన రోడ్డుకు 7కి.మీ. దూరంలో అతిదారుణంగా కొట్టి చంపేశారు. వెంకటేశ్వర్లు దగ్గర వున్న ఉంగరాలను, సెల్‌ఫోన్లను తీసుకున్నారు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు భార్య సైదాపురం పోలీసులకు కిడ్నాప్ అయిన రోజే ఫిర్యాదు చేసింది. గూడూరు రూరల్ సిఐ అక్కేశ్వరరావు, బాబీ ఐడి పార్టీ సిబ్బంది ఆర్.వెంకటేశ్వరరాజు, ఆదినారాయణ తదితరుల బృందం కిడ్నాప్ కేసుకు సంబంధించి దర్యాప్తు చేశారు.



## మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఖత్నాలు

సమాజంలో ప్రతి ఒక్కరూ ఆచార సంప్రదాయాలను గౌరవించాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. పట్టణంలోని షాదిమంజిల్ మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఖత్నాల కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి అండగా ఉంటానని, మైనార్టీ నిరుద్యోగులకు న్యాయం చేస్తానని తెలిపారు. ఈద్గా నిర్మాణంలో ఇల్లు కోల్పోయిన ముస్తాఫా అనే వ్యక్తికి రూ.20వేలు అందజేశారు. ఇల్లు మంజూరుయ్యేలా చూస్తానని అన్నారు. నెట్‌వర్క్ చేస్తున్న ఉచిత సేవలను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో నెట్‌వర్క్ అధ్యక్షుడు అబ్దుల్ రహీం, గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్‌అహ్మద్, సంస్థ సభ్యులు రఫీ, రవూఫ్ తదితరులు ఉన్నారు.

## అళఘునాథునికి ప్రత్యేకపూజలు

గూడూరు పట్టణంలోని అళఘునాథస్వామి దేవస్థానంలో శ్రీ మద్రామానుజాచార్యులు జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తిరునక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. ఉదయాన్నే స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. రంగురంగుల విద్యుత్ దీపాలంకరణ, మంగళవాయిద్యాల నడుమ వేదపండితులు వేదమంత్రోచ్చారణలతో స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా సిద్ధారెడ్డి జనార్ధన్‌రెడ్డి, ఇంద్రసేనమ్మ వ్యవహరించారు.



# ఘనంగా శ్రీశ్రీ జయంతి వేడుకలు

నెల్లూరు అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు టౌన్‌హాలు వర్ధమాన సమాజంలో మహాకవి శ్రీశ్రీ 108వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కవితా పఠనంలో పాల్గొన్న కవులకు, రచయితలకు, సంగీత పోటీల్లో పాల్గొన్న విజేతలకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ముఖ్యఅతిథులుగా చెలంచర్ల భాస్కరరెడ్డి, ఆలిండియా రేడియో మాజీడైరెక్టర్ వి.బి.ఆనంద్ పాల్గొని శ్రీశ్రీ కవిత్వం, గేయాలను గురించి సవివరంగా వివరించారు. సభకు ముందు శ్రీశ్రీ చిత్రపటానికి పుష్పాభిషేకం నిర్వహించారు. అభినయ ఆర్ట్స్ అధ్యక్షులు సి.ఆర్.రాఘవ మహాకవి శ్రీశ్రీ సాహిత్య ప్రతిభను, నిన్నటితరం నుండి రేపటి తరం వరకు విశ్లేషిస్తూ, సామాన్యులకు అందుబాటులో లేని సాహిత్య గమనాన్ని శ్రీశ్రీ భూమార్గం పట్టించి, భూకంపం పుట్టించిన ఆధ్యుడిగా, కవితా ప్రక్రియ సృష్టికర్తగా పేర్కొన్నారు. అనంతరం శ్రీశ్రీ రచించిన మధురమైన సినిమా పాటలను ప్రముఖ గాయకుడు పి.కృష్ణయ్య వీనుల విందుగా ఆలపించారు. శ్రీశ్రీ సినీపాటల్లోని ఔన్నత్యాన్ని సాహిత్య విశిష్టతను గాయకుడు యన్.శ్రీనివాసులురెడ్డి సోదాహరణంగా వివరించారు. పాతూరి అన్నపూర్ణ, తుంగా నారాయణరెడ్డి, మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, బిరదవోలు రామిరెడ్డి, జెఎస్‌ఆర్ ఆంజనేయులు, ఎన్.వి.రమణయ్య, బొగ్గవరపు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సామూహిక ఉపనయనాలు



నెల్లూరు బాలాజీనగర్‌లోని తుమ్మగుంట ద్రావిడ బ్రాహ్మణ సంఘ కార్యాలయంలో బ్రహ్మశ్రీ మాచవోలు రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో సామూహిక ఉచిత ఉపనయనాలను ఆదివారం నిర్వహించారు. వటువులకు కంచి కామకోటి పీఠం నుంచి ఆశీర్వదించి పంపిన సంధ్యావందనం పుస్తకాలు, సద్విషియ సంగ్రహం, నిత్యపారాయణ పుస్తకాలను వంజారి వెంకటశివసుబ్రహ్మణ్య శర్మ అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన రిటైర్డ్ హైకోర్టు జడ్జి గుర్రం వెంకట సీతాపతిని సత్కరించారు. సంఘ వ్యవస్థాపకులు పాటూరు వెంకటరామసుబ్రహ్మణ్య ప్రసాద్‌శర్మ, మాచవోలు రాజశేఖరశాస్త్రి, వంజారి శ్రీనివాసులు, మాచవోలు భాస్కరశర్మ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయమూర్తుల బదిలీలు... నియామకాలు

ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు పలువురు న్యాయమూర్తులను బదిలీచేస్తూ, కొందరిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు మొదటి అదనపు సీనియర్ సివిల్‌జడ్జిగా పనిచేస్తున్న జి.భూపాల్‌రెడ్డిని విజయవాడ చీఫ్ మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్‌గా బదిలీ చేశారు. ఈయన స్థానంలో సూళ్ళూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జిగా పనిచేస్తున్న టి.హరితను పదోన్నతిపై నియమించారు. గూడూరు సీనియర్ సివిల్ జడ్జి డి.ఏడుకొండలును తిరుపతి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జిగా బదిలీచేసారు. ఈ స్థానంలో ప్రకాశం జిల్లా మార్కాపురం సీనియర్ సివిల్‌జడ్జి కె.సీతారామకృష్ణారావు నియమితులయ్యారు. కోవూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి డి.బాలకృష్ణయ్య పదోన్నతిపై విజయవాడ 6వ అదనపు సీనియర్ సివిల్‌జడ్జిగా బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

గల్పిక

# ప్రపంచ పిచ్చోళ్ళ తిక్క కుదిర్చిన చంద్రబాబు

అది జపాన్ రాజధాని టోక్యో! జపాన్ ప్రధాని షింజోఅబే కార్యాలయం. షింజో అబేతో పాటు చైనా అధ్యక్షుడు జింగ్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్, భారత ప్రధాని నరేంద్రమోడీ, బ్రిటన్ ప్రధాని థెరిస్సా, పాక్ ప్రధాని నవాజ్‌షరీఫ్, జర్మనీ ఛాన్సలర్ మోర్కెల్‌లు సమావేశమైవున్నారు. జపాన్ ప్రధాని షింజోఅబే వారినుద్దేశించి మాట్లాడుతూ... మిమ్మల్నందరినీ ఇంత అర్జంట్‌గా పిలిపించినందుకు మన్నించండి, కాని పిలిపించాల్సిన పరిస్థితి మాత్రం అలాంటిది. ఇప్పుడు ప్రపంచం పరిస్థితి పిచ్చోళ్ల చేతిలో రాళ్ళ దెబ్బలు తినడానికి సిద్ధంగా వున్నట్లుంది. ఈ ప్రమాదం నుండి ఎలా బయటపడాలో చర్చించేదానికే మిమ్మల్ని పిలిపించానన్నాడు. వెంటనే చైనా అధ్యక్షుడు జింగ్‌పింగ్ వుండి... సోది ఆపి స్టోరీ ఏంటో చెప్పండన్నాడు. ఆ తర్వాత భారత ప్రధాని మోడీ కూడా... మా దేశానికి వెళ్ళి నేను కూడా జనాన్ని బాదాల్సిన పనులు చాలానే వున్నాయి, సబ్జెక్ట్‌లోకి రండి అన్నాడు. అందుకు షింజో అబే... ప్రపంచానికి ఇప్పుడు ఇద్దరు పిచ్చోళ్ళు ప్రమాదకరంగా తయారయ్యారు. ఒకరు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, రెండోవాడు ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్. వీళ్లిద్దరి తలకాయలు ఒకటే, ఆలోచనలు ఒకటేగా ఉంటున్నాయి. ఇద్దరు కూడా కయ్యానికి కాలు దువ్వుతున్నారు. ఇద్దరి దగ్గరా అణు బాంబులే కాదు అంతకుమించిన శక్తివంతమైన బాంబులు కూడా వున్నాయి. ఆ కిమ్ అయితే మూడురోజుల్లో అమెరికాను నాశనం చేస్తానంటున్నాడు. ట్రంప్ అయితే ఉత్తరకొరియాను ప్రపంచ పటంలో లేకుండా చేస్తానంటాడు... ఒక్క విషయం ఏంటంటే ఈ రెండు దేశాల సైన్యం కాని, ప్రజలు కాని యుద్ధాన్ని కోరుకోవడం లేదు. కేవలం ఈ ఇద్దరు మాత్రమే కోరుకుంటున్నారు. ఇద్దరి పిచ్చోళ్ల వెర్రివేషాలకు మూడో ప్రపంచ యుద్ధం అవసరమా? లక్షలాది మంది ప్రజలు బలికావాలా? యుద్ధం దెబ్బలు తగిలిన వాళ్లం కాబట్టే, అణుబాంబుల వినాశనాన్ని అనుభవించిన వాళ్ళం కాబట్టే ఆ బాధ తెలిసిన వాళ్లంగా నేను ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసానన్నాడు. పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ వుండి... వాళ్ళిద్దర్నీ యుద్ధం చేసుకుంటే చేసుకోనీయండి, మనం చూస్తూ ఎంజాయ్ చేయొచ్చు కదా, మేం చూడండి, భారత్‌తో దొంగచాటు యుద్ధాలు చేస్తూ ఎంత పైశాచికానందం అనుభవిస్తున్నామో అని చెప్పాడు. వెంటనే భారత ప్రధాని మోడీ లేచి... సార్, యుద్ధాలను తమ పైశాచిక అనందాల కోసంగా పరిగణించే మానవత్వంలేని మనుషుల గురించి మనం ఆలోచించనక్కరలేదు. ప్రపంచ శాంతి కోసం మేమెప్పుడూ ముందుంటాం. మానసిక ప్రవర్తన విపరీతంగా వుండే ట్రంప్, కిమ్ లాంటి వారిని కొన్ని టెక్నికల్ పద్ధతుల ద్వారా దారికి తేవాలి. వీళ్లిద్దరి మనసుల్లోనూ యుద్ధం చేయాలనే ఆకాంక్ష బలంగా వుంది. వారి మనసుల్లో వున్న ఆ కాంక్షను నెరవేరిస్తే చాలు... 'చంద్రముఖి' సినిమాలో దెయ్యం వదిలేసిన 'జ్యోతిక' లాగా తిరిగి మామూలు మనుషులవుతారని చెప్పాడు. ఆ తలకాయ నొప్పేదో మీరే చూసి ఈ ప్రపంచానికి ఆ పిచ్చోళ్ల యుద్ధోన్మాదం నుండి విముక్తి కల్పించండని షింజోఅబే వేడుకున్నాడు.

★★★★★

డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లో కూర్చుని ఉత్తరకొరియాపై యుద్ధ సన్నివేశాలను లైవ్‌లో చూస్తున్నాడు. అమెరికా యుద్ధ విమానాలు రయ్‌మంటూ నింగికి లేస్తున్నాయి. కొన్ని నిముషాలలోనే ఉత్తర కొరియా దేశంలోని భారీభవనాల మీద బాంబులు వేస్తున్నాయి. ఆ బాంబుల ధాటికి ఉత్తరకొరియాలోని అన్ని నగరాలు ధ్వంస మవుతున్నాయి. ఆ సీన్‌లు చూస్తూ ట్రంప్ వెర్రికేకలు వేస్తూ ఆనందంతో ఊగిపోతున్నాడు.

★★★★★

ఉత్తరకొరియా అధ్యక్షుడు తన కార్యాలయంలో కూర్చుని లైవ్ చూస్తున్నాడు. ఉత్తరకొరియా యుద్ధ విమానాలు అమెరికా మీద బాంబుల వర్షం కురిపిస్తున్నాయి. వాషింగ్టన్, న్యూయార్క్, కాలిఫోర్నియా, లాస్‌ఏంజల్స్ వంటి నగరాలన్నీ కూడా ధ్వంసమవుతున్నాయి. ఆ సీన్‌లు చూసి కిమ్ వికటాట్టహాసం చేయసాగాడు. ఇన్నాళ్లకు నా కసి తీరిందని మనసు ప్రశాంతం చేసుకున్నాడు.

★★★★★

టోక్యోలోని షింజోఅబే కార్యాలయం. అంతకుముందులాగే అన్ని దేశాల అధినేతలు వచ్చారు. షింజో అబే వుండి... మోడీగారు, మీకు అన్ని దేశాల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నాము. మూర్ఖత్వానికే మేనమామలుగా వున్న వాళ్లిద్దరినీ మీరు ఎలా దారికి తేగలిగారు అని అడిగాడు. అందుకు మోడీ... మీరంతా వాళ్లిద్దర్నీ ఒక వైపే చూసారు, నేను వాళ్లను రెండో వైపు చూసాను. వాళ్లు చిన్నప్పటి నుండి యుద్ధాలను చూస్తూ పెరిగారు. కాబట్టి మేం కూడా యుద్ధం చేయాలనే ఆకాంక్ష వారిలో పోలవరం ప్రాజెక్ట్ అంచనా వ్యయం లాగా ఎప్పటికప్పుడు పెరుగుతూ వచ్చింది. అప్పుడు నేను ఒకటే ఆలోచించాను, మనం ఎదుర్కోవాల్సింది వాళ్లిద్దర్నీ కాదు, వాళ్ళలో వున్న యుద్ధం చేయాలన్న శాడిజాన్ని అని! పేషంట్ రోగం కనిపెడితే డాక్టర్‌కు వైద్యం చేయడం సులభమవుతుంది. వాళ్లిద్దరి రోగాన్ని కనిపెట్టాను కాబట్టే సమస్యను పరిష్కరించడం నాకు సులభమైందని మోడీ చంద్రముఖి సినిమాలో రజనీకాంత్ లెవల్లో చెప్పాడు. వెంటనే బ్రిటన్ ప్రధాని థెరిస్సా... ఇంత ఘనకార్యం చేసినందుకు మిమ్మల్ని సన్మానించాలనుకుంటున్నామని మోడీతో అంది. అందుకు ఆయన... నో, ఇందుకు నేను ఏ మాత్రం అర్హుడిని కాను, దీనికి అర్హులైన వాళ్లు ఇక్కడే వున్నారు... పిలుస్తానుండండి అని... ఎవరికో ఫోన్ చేసాడు. రెండు నిముషాల తర్వాత హైటెక్‌రత్న చంద్రబాబు లోపలకు వచ్చాడు. మోడీ అతనిని చూపిస్తూ ఈ సన్మానం చేయాల్సింది ఈయనకే... మూడేళ్లలోనే ఎన్నో నగరాలతో కూడిన రాజధాని కట్టిస్తానని చెప్పాడు. ఇన్ని నగరాలను ఒకే నగరంలో ఎలా పొందుపరుస్తారని అడిగాను. అందుకు ఆయన చెప్పిన సమాధానం... రాజధానులు కట్టాలంటే కావాల్సింది ఇటుక, ఇసుక, సిమెంట్ కాదు, ఒక కంప్యూటర్, ఒక గ్రాఫిక్ డిజైనర్ ఉంటే చాలన్నాడు. ఆ గ్రాఫిక్స్‌లోనే ఆయన అమెరికా, ఉత్తర కొరియాలను సృష్టించాడు. వాటి మీద బాంబులు వేస్తున్నట్లు, యుద్ధం జరుగుతున్నట్లు గ్రాఫిక్ డిజైన్ చేసాడు. ఇందుకు 'బాహుబలి' డైరెక్టర్ రాజమౌళి సహకారం కూడా తీసుకున్నాడు. అమెరికా, ఉత్తర కొరియా సైనికులు, అధికారులు కూడా ఆయనకు సహకరించడం వల్ల వారి దేశాధినేతలకు వీరు గ్రాఫిక్ డిజైన్ చేసిన యుద్ధ దృశ్యాలను ప్రత్యక్షప్రసారం చేయగలిగారు. ఆ యుద్ధం సీన్‌లను లైవ్‌లో చూడడం వల్లే ట్రంప్, కిమ్‌లిద్దరిలోనూ యుద్ధకాంక్ష తీరిపోయింది. ఇప్పుడు వాళ్ళు మామూలు మనుషులు. శాంతిమూర్తి గాంధీకి వారసులు. శత్రు దేశాలు కవ్వించినా వాళ్లిద్దరూ ఇక 'అహింసే మా ఆయుధం' అంటారని చెప్పాడు. మోడీ మాట్లాడ్డం అయ్యాక, ఆయా దేశాధినేతలంతా చప్పట్లతో హోరెత్తించడమే కాదు, శాలువాలు కప్పి చంద్రబాబును అభినందించారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

కుటుంబపరంగా చిన్నచిన్న సమస్యలుండి సర్దుబాటు కాగలవు. వృత్తి వ్యాపారాలు బాగుండి ఆదాయం ఫరవాలేదనిపించినా, అంతే మోతాదులో ఖర్చులు కూడా పెరుగుతాయి. శుభకార్య నిర్ణయాలు జరుగగలవు. దూరప్రయాణాలుంటాయి. అనవసర బాధ్యతలను పైన వేసికొనవద్దు. ఎటువంటి నిర్ణయాలైనా ఖచ్చితంగా తీసికొనండి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆర్థిక వ్యవహారాలను, ఒప్పందాలను జాగ్రత్తగా జరపండి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఆదాయం సామాన్యంగా ఉంటుంది. కాంట్రాక్టు పనులు, గృహనిర్మాణాలు మందకొడిగా సాగుతాయి. అనుకున్న పనులను సమర్ధవంతంగా జరుపుతారు. మీ సూచనలు సలహాల వల్ల ఇతరులకు మంచి జరుగుతుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కుటుంబసౌఖ్యం బాగుంటుంది. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. దూరప్రయాణాలు నిర్ణయం కాగలవు. కొత్త వస్తు ఆభరణాలు, స్థిరాస్తులు సమకూరుతాయి. ప్రముఖులతో పరిచయాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి, రాబడి పెరుగుట, కొత్త పెట్టుబడులకు అవకాశాలు లభించగలవు. భూ లావాదేవీలు వాయిదా వేసికొనండి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆదాయము తగినట్లు ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలు వేగం పుంజుకొని అభివృద్ధి కలిగి ఉంటాయి. మీ సహాయ సహకారాల వల్ల ఇతరులకు మంచి జరుగుతుంది. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. కొత్త వ్యాపారాలకు పెట్టుబడులకు అనుకూలత బాగుంటుంది. నిర్మాణాలు జరిపేవారికి, కాంట్రాక్టర్లకు స్వల్ప ఇబ్బందులుంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

మంచి ఆర్థికావకాశాలుండి అవకాశాలను సద్వినియోగం చేసికొంటారు. ఆదాయం పెరుగుతుంది. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. కుటుంబ ఆత్మీయులకు కొద్ది అనారోగ్య బాధలుంటాయి. అనుకున్న పనులు నిదానంగా జరిగి టెన్షన్ పెట్టగలవు. అనవసర వ్యవహారాలలో ప్రవేశించవద్దు. ఉద్యోగులకు పనిభారం పెరిగినను అధికారుల సహకారం బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి ఉపాధి పథకాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వ్యాపారాలు ఆశించిన రీతిలో సాగవు. అయినా డబ్బుకు ఇబ్బందులుండవు. అనుకున్న పనులకు స్వల్ప ఆటంకాలుండినా, వ్యవహారం మలుపు తిరిగి పనులు పూర్తికాగలవు. వ్యాపారులకు ఉద్యోగులకు ప్రభుత్వ పరంగా ఇబ్బందులుంటాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. కోర్టు వ్యవహారాలు వాయిదాపడతాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 5.5.2017 నుండి
తేది. 11.5.2017 వరకు

ఈ వారము కుంభంలో కేతువు, మీనంలో శుక్రుడు, మేషంలో రవి బుధులు, వృషభంలో కుజుడు, సింహంలో రాహువు, కన్యలో గురువు, ధనుస్సులో శని, సింహ కన్య తులా రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము

తేది 11 గురువారము నిజకర్తరి ప్రారంభము
తేది 9 మంగళవారము నృసింహ జయంతి.

### ముహూర్తములు

తేది 6 శనివారము ఉదయము గంట 10.30 నుండి 12.30లోగా ఉత్తర నక్షత్రము, కర్నాటక లగ్నమున వివాహము.
తేది 7 ఆదివారము ఉదయము గంట 10.20 నుండి గంట 12.0లోగా వ్యాపార, వివాహములు కర్కాటక లగ్నము.

### వైశాఖ మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 5 | శుక్ర | దశమి | రా॥ గం.10.34వ॥ |
| తేది. 6 | శని | ఏకాదశి | రా॥ గం.10.14వ॥ |
| తేది. 7 | ఆది | ద్వాదశి | రా॥ గం.10.24వ॥ |
| తేది. 8 | సోమ | త్రయోదశి | రా॥ గం.11.04వ॥ |
| తేది. 9 | మంగళ | చతుర్దశి | రా॥ గం. 12.14వ॥ |
| తేది. 10 | బుధ | పూర్ణిమ | రా॥ గం.1.46వ॥ |
| తేది. 11 | గురు | పాడ్యమి | రా॥ గం.3.38వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థికంగా కొద్ది ఒడిదుడుకులుంటాయి. ఆదాయం సామాన్యంగా ఉంటుంది. కోర్టు వ్యవహారాలందు అనుకూలత ఉంటుంది. శుభకార్యాల ప్రయత్నాలలో అనుకూలత తక్కువ. గృహ వస్తువాహన సౌకర్యముల ఖర్చులు రిపేర్లుంటాయి. అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును. పెద్దమొత్తాలలో సహాయం చేయడం మంచిది కాదు. ఉద్యోగావకాశాలు బాగుంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అనుకున్న పనులు ఆకస్మికంగా నెరవేరుతాయి. ఆదాయం ఖర్చులు సరిపోతుంటాయి. వ్యాపారవృద్ధి అవకాశాలు చేజారిపోతాయి. విమర్శలకు ప్రతి విమర్శలు చేస్తారు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. తొందరపాటు వ్యవహారాలు, మాటలు తగ్గించుకొనాలి. భాగస్వామ్య చర్చలు ఫలించగలవు. విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. ఉన్నత విద్యావకాశాలు లభించగలవు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కొత్త పెట్టుబడులకు, వ్యాపార విస్తరణకు అవకాశాలు దొరుకుతాయి. వ్యాపారము, వృత్తి జీవనాలు వృద్ధికరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. బాకీల వత్తిడి కొద్దిగా ఉంటుంది. సందర్భాన్ని అనుసరించి ప్రవర్తించండి. ప్రముఖులను, ముఖ్యవ్యక్తులను కలుసుకొంటారు. హామీలను, అప్పులను తొందరపడి ఇవ్వవద్దు. ఉద్యోగులకు స్థానమార్పులుండగలవు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలలో అవకాశాలు కలిసివస్తాయి. ఆర్థికంగా బాగుండి ఆదాయం పెరుగుతుంది. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. శుభకార్యాలు, దూర దేశ ప్రయాణాలు నిర్ణయం కాగలవు. బంధు శ్రేణి నుండి శుభవార్తలు వింటారు. విద్యావకాశాలు మెరుగ్గా ఉంటాయి. వ్యతిరేకించిన వారే మీకు చేరువ కాగలరు. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఇంటా బయట వ్యవహారాలందు అవరోధాలను అధిగమించుతారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. కొత్త పెట్టుబడులకు అవకాశాలు, డబ్బు మదుపు చేసి కొనగలరు. అప్పుడప్పుడు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. పిల్లల విద్యా, శుభకార్య విషయాలలో శ్రద్ధ చూపుతారు. వ్యాపారాలలో అభివృద్ధి, దైవ సేవాసంస్థలకు సహాయపడటం, నిర్మాణాలు చేసేవారికి పురోగతి బాగుంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అధికారులకు కొత్త బాధ్యతలు, పనిభారం ఉంటుంది. అనుకున్న పనులు సకాలంలో పూర్తి చేస్తారు. మీ సలహాలు, మీ నిర్ణయాలు ఎదుటివారికి అంగీకారమై, మంచి గుర్తింపు గౌరవాలు పొందుతారు. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి, ఆదాయం పెరుగుట, డబ్బు మదుపు చేసే అవకాశాలు దొరుకుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

# ఆస్మా వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం

- డాక్టర్ గౌరీనాధ్



ఆస్మా వ్యాధిపట్ల ప్రజలంతా అప్రమత్తంగా వుండాలని, ఆ వ్యాధి రాకుండా తగు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ వైద్యనిపుణుడు డాక్టర్ గౌరీనాధ్ అన్నారు. ప్రపంచ ఆస్మాదినం సందర్భంగా మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఆస్మా వ్యాధి లక్షణాలు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఆస్మా వ్యాధి బాగా విస్తరిస్తోందని, అందువల్ల ఈ వ్యాధి పట్ల అందరూ తగు అవగాహన కలిగివుండి, వ్యాధి నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఈ ఏడాది ఆస్మా వ్యాధి నిర్ధారణకు అవసరమైన వైద్యపరీక్షలకు 50 శాతం రాయితీ ప్రకటించిందని పేర్కొన్నారు. అదేవిధంగా ఉచితంగా వైద్యసలహాలు కూడా అందిస్తున్నామని, ఈ అవకాశం ఈనెల 10వతేదీ వరకు వుంటుందని కనుక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నెల్లూరు మిషన్ భగీరథుడు

(మొదటి పేజీ తరువాయి)





గొంతు తడారిన పల్లెసీమలను గుర్తిస్తూ, తన సొంత నిధులతో ఆ పల్లెల్లో మినరల్‌వాటర్ ప్లాంట్లను పెట్టిస్తూ మీ గొంతుల్లోనే కాదు, మీ గుండెల్లోనూ తడారనివ్వనని భరోసా ఇస్తున్న ఆ మిషన్ భగీరథుడే ప్రముఖ దాత, విపిఆర్ ఫౌండేషన్ అధినేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి!

## పల్లెప్రజలకు గుక్కెడు నీరందించడంలోనే సంతృప్తి

**- వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి**

విపిఆర్ అమృతధార కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజల దాహార్తి తీర్చడం తనకెంతో సంతృప్తి కలిగిస్తోందని ప్రముఖ దాత విపిఆర్ ఫౌండేషన్ అధినేత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు. మంగళ వారం ఆయన జలదంకి, కలిగిరి మండలాల్లో విపిఆర్ వికాస్ అమృతధార కార్యక్రమాన్ని తన చేతుల మీదుగా ప్రారంభించిన అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ, తాము ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ ప్రజలకు గుక్కెడు మంచినీరు అందివ్వడంలో తమకెంతో అనందం వుందన్నారు. విపిఆర్ వికాస్ ద్వారా అమృతధార పథకం కింద ఈ ఏడాదిలో నూరు మినరల్ వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటుచేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు తొలి ప్రాధాన్యత ఇచ్చి ఈ ప్లాంట్‌లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. జలదంకి మండలంలోని సోమవరప్పాడు గ్రామంలో 3వ విడతగా ఆ గ్రామపెద్దలైన రమణారెడ్డి, కామేశ్వరమ్మ చేతుల మీదుగా వేమిరెడ్డి ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభింపజేశారు. అదేవిధంగా కలిగిరి మండలంలోని తూర్పు గుడ్లదొనలో గ్రామ పెద్దలు సుబ్బారెడ్డి, శేషమ్మల చేతుల మీదుగా ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభింపజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సిఇఓ ప్రొ. వి.నారాయణరెడ్డి, చీఫ్ కో-ఆర్డినేటర్ ఎన్.శంకర్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, సర్పంచ్‌లు శ్రీనివాసులురెడ్డి, ఆదిశేషారెడ్డి, ఎంపిటిసి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం యువతకు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి క్రికెట్ కిట్‌లను, వాలీబాల్ కిట్‌లను అందజేశారు.

## ప్రజల ప్రశంసలందుకుంటున్న విపిఆర్ సేవలు :

విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విపిఆర్ విద్య, విపిఆర్ వైద్యం, విపిఆర్ వాత్సల్యం సంస్థలు ఇప్పటికే జిల్లా ప్రజల మనసుల్లో సముచిత స్థానం సంపాదించుకున్నాయి. ఇందులో భాగంగానే వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో 'విపిఆర్ వికాస్' అనే నూతన కార్యక్రమాన్ని ఇటీవలే ప్రారంభించిన విషయం అందరికీ తెలిసిందే. వెనుకబడిన గ్రామాల్లో త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం 100ఆర్ఓ మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటుచేయాలనే లక్ష్యంతో ఎంపిక చేసిన గ్రామాల్లో ఆ మేరకు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి వాటి స్థాపనకు కృషి చేస్తుండడం ప్రజలందరికీ ఎంతో ఆనందం కలిగిస్తోంది. ఈ సందర్భంగానే గ్రామీణ యువతకు క్రీడాస్ఫూర్తినందిస్తూ వారికి అవసరమైన క్రికెట్, వాలీబాల్ కిట్‌లను అందజేస్తుండడం యువతలో ఎంతో ఉత్సాహాన్నిస్తోంది. విపిఆర్ వికాస్ ద్వారా ఇప్పటికే తొలివిడతగా ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల్లో 8 గ్రామాల్లో ఆర్ఓ ప్లాంట్‌లు స్థాపించి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చేతుల మీదుగా విపిఆర్ అమృతధార కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2వ విడతలో సీతారామపురం మండలం బసినేనిపల్లిలో, ఉదయగిరి మండలం దాసరిపల్లి గ్రామం లోనూ మినరల్ వాటర్ ప్లాంట్‌లు ప్రారంభించి ప్రజల దాహార్తిని తీర్చారు.

## బసినేనిపల్లిలో :

తొలుత రెండవ విడతలో భాగంగా సోమవారం సీతారామపురం మండలంలోని బసినేనిపల్లి గ్రామంలో ఉదయం 9 గంటలకు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సమక్షంలో గ్రామపెద్దలు ఖాజావలి, మహబూబాబీ చేతుల మీదుగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని విపిఆర్ వికాస్ కార్యక్రమం ద్వారా గ్రామీణ యువతను భాగస్వాములను చేసి ఈ మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషదాయకమన్నారు. మనిషికి నీరు ప్రాణాధారం కనుక, ఈ కార్యక్రమానికి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ మినరల్ వాటర్ ప్లాంట్‌ను గ్రామంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొ. వి.నారాయణరెడ్డి, ఛీఫ్ కో-ఆర్డినేటర్ ఎన్.శంకర్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, గ్రామసర్పంచ్ శ్రీమతి రమాదేవి, రమణయ్య, గ్రామపెద్దలు వేంకటసుబ్బారెడ్డి మరియు వికాస్ యువత, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి యువతకు క్రికెట్ కిట్‌లను, వాలీబాల్ కిట్‌లను ప్రదానం చేశారు.

## దాసరిపల్లి గ్రామంలో :

ఆ తర్వాత అదే రోజున ఉదయగిరి మండలం దాసరపల్లి గ్రామంలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సమక్షంలో గ్రామపెద్దలు మొహిద్దీన్ షా, ఫాతిమా చేతుల మీదుగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చేజర్ల సుబ్బారెడ్డి, సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, విపిఆర్ వికాస్ యువత తదితరులు పాల్గొన్నారు. అనంతరం వేమిరెడ్డి చేతుల మీదుగా గ్రామ యువతకు క్రికెట్ కిట్‌లు, వాలీబాల్ కిట్‌లు అంద జేశారు. అదేరోజు మధ్యాహ్నం 12గంటలకు వింజమూరు మండలంలోని జనార్ధనపురం గ్రామంలోనూ గ్రామపెద్దలు యహోనా చేతుల మీదుగా మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కొండస్వామి, గ్రామపెద్ద రవి, మోహన్‌రెడ్డి, విపిఆర్ వికాస్ యువత పాల్గొన్నారు. అనంతరం గ్రామయువతకు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చేతుల మీదుగా క్రికెట్ కిట్‌లు, వాలీబాల్ కిట్‌లు అందజేశారు.





నెల్లూరు నగర విలీన గ్రామాల్లో, శివారు కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టడంలో అధికారుల నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ ఈ నెల 1న నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ ఎదుట నిరసన దీక్ష చేస్తున్న నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

# విజయవాడ కవిసమ్మేళనంలో నెల్లూరు కవులు



మహాకవి శ్రీశ్రీ 108వ జయంతిని పురస్కరించుకుని విజయవాడ సాంస్కృతిక సమాఖ్య మరియు 'సాహితీ స్రవంతి' సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ ఎం.బి విజ్ఞాన కేంద్రంలో ఏప్రిల్ 30న జరిగిన జాతీయస్థాయి శతాధిక కవిసమ్మేళనంలో పలువురు నెల్లూరు కవులు పాల్గొని అందరి అభినందనలు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి నెల్లూరుకు చెందిన పెన్నా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి గుండాల నరేంద్రబాబు అనుసంధానకర్తగా వ్యవహరించి రాష్ట్ర అధికారభాషా సంఘం అధ్యక్షుడు పోట్లూరి హరికృష్ణ, సాంస్కృతిక సంస్థ ప్రధాన కార్యదర్శి వి. శిరీష్‌కుమార్ తదితరుల నుంచి అభినందనలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లాకు చెందిన కవులు గాలి లలితాప్రవల్లిక, ములుగు విజయదుర్గ, మాటేటి రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జోరు పెంచిన జగన్

(మొదటి పేజీ తరువాయి)

తండ్రిలాగే మాటిస్తే తప్పడనే పేరును మాత్రం నిలుపుకున్నాడు. అయితే 2014 ఎన్నికల నాటి వైఫల్యాలను గుణపాఠంగా తీసుకున్న జగన్ రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వాటన్నింటిని కూడా సరిదిద్దుకుంటున్నాడు. ముఖ్యంగా అధికారపార్టీ వైఫల్యాలను ఓట్లుగా మలచుకునే ప్రక్రియను వేగవంతం చేశాడు. రాష్ట్ర రాజకీయాలను శాసించే యువత దృష్టిని ప్రముఖంగా ఆకర్షిస్తున్నది జగనే! ప్రత్యేకహోదా విషయంలో చంద్రబాబు రాష్ట్రంలో యువతకు టోపీ పెడితే, ఆ ప్రత్యేకహోదా కోసం ఇప్పటికీ పోరాడుతున్నది జగనే! ప్రత్యేకహోదా కోసం రాష్ట్ర వ్యాప్తంగా జగన్ చేపట్టిన దీక్షలకు సైతం యువత నుండి విశేషస్పందన రావడం చూసాం. 2014 ఎన్నికల్లో చంద్రబాబు చేసిన ఋణమాఫీ వాగ్దానం వల్ల రైతులు తెలుగుదేశాన్ని నమ్మారు. అధికారంలోకి వచ్చాక చంద్రబాబు చేసిన ఋణమాఫీ వడ్డీలకు కూడా సరిపోలేదు. ఇక రాష్ట్రవ్యాప్తంగా కూడా సెజ్‌ల పేరుతో ప్రభుత్వం చేస్తున్న భూదోపిడీకి బలవుతున్నది కూడా రైతులే! ఇప్పుడు పండించుకుంటున్న పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు లబోదిబోమంటున్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఏ రైతూ సంతోషంగా లేడు. దీనికితోడు కరువు కాటకాలతో రైతాంగం అల్లాడుతోంది. గిట్టుబాటు ధరలు లేని మిర్చి రైతుల కోసం జగన్ గుంటూరులో నిర్వహించిన రైతు దీక్షకు రైతులు పోటెత్తడం చూసాము. అలాగే బి.సిలలో చేరుస్తామన్న చంద్రబాబు మాట నమ్మి తెలుగుదేశానికి మద్దతు తెలిపిన కాపులు సైతం ఈరోజు కసితో రగిలిపోతున్నారు. చంద్రబాబుపై దండయాత్రకు సిద్ధంగా వున్నారు. జీవితంలో ఒకే ఒక్కసారి చంద్రబాబును నమ్మిన పాపానికి మోసపోయామనే బాధతో వున్నారు. ఇక మైనార్టీలు జగన్‌కు బలమైన అండగా నిలిచివున్నారు.

రాష్ట్రంలో ఒకట్రెండు సామాజిక వర్గాల నుండి తప్పితే మిగిలిన అన్ని సామాజిక వర్గాల నుండి కూడా జగన్‌కు బలమైన మద్దతు లభిస్తుంది. ముఖ్యంగా యువత, అన్నదాత జగన్‌కు అండగా నిలవనున్నారు. జగన్ చేసుకోవాల్సిందల్లా 2014 ఎన్నికలనాటి వైఫల్యాలను పునరావృతం కాకుండా చూసుకోవడమే! పార్టీ కమిటీలను పటిష్టం చేయాలి. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలతో బూత్‌కమిటీలు వేయాలి. వార్డులు మొదలుకొని మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాలవారీగా కమిటీలను నియమించాలి. ప్రతిజిల్లాకు ఒక్కో ఇన్‌ఛార్జిని నియమించాలి. కొందరు సీనియర్లను ఎన్నికల్లో నిలపకుండా ఎన్నికలు నడిపే పరిశీలకులుగా నియమించుకోవాలి.

జగన్ గతానికి చాలా భిన్నంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సీనియర్ నాయకులను, తన తండ్రి వై.యస్. సన్నిహితులను తిరిగి దగ్గరకు చేర్చుకోవాలనే ఆలోచనలో వున్నట్లు సమాచారం. ప్రజల్లో వున్న అభిమానమే కాదు, రాజకీయాలలో, ఎన్నికలలో వ్యూహప్రతివ్యూహాలు నడిపే నాయకగణాలు కూడా ఎంతో అవసరం. ఈ గణాలను సమకూర్చుకునే దిశగా జగన్ అన్ని వైపుల నుండి జోరు పెంచాడు. ఓ పక్క ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఇంకో పక్క ప్రజాక్షేత్రంలో పోరాటాల ద్వారా ప్రజామద్దతు కూడగడుతూ మరోపక్క మిత్రులను దరి చేర్చుకుంటూ పక్కా వ్యూహాలతో ఆయన ఎన్నికల యుద్ధానికి సిద్ధమవుతున్నాడని సమాచారం.

## వేడుకగా..

# శ్రీ వేణుదత్త సువర్ణలక్ష్మీ దాంపత్యవ్రతం

### - భక్తులకు శ్రీ రామదూతస్వామి మంగళాశీస్సులు



భగవాన్ శ్రీ రామదూతస్వామి ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కస్తూరిదేవి స్కూల్ ప్రాంగణంలోని డా.రవీంద్రనాధ్ ఠాగూర్ కళ్యాణమండపంలో ఎంతో వేడుకగా శ్రీ వేణుదత్త సువర్ణలక్ష్మి దాంపత్య వ్రత మహాయాగం నిర్వహించారు. లోకకల్యాణం కోసం నిర్వహించిన ఈ మహాయాగంలో అనేకమంది దంపతులు పాల్గొనగా, ఎంతో భక్తిశ్రద్ధలతో వారిచేత శ్రీ రామదూతస్వామి హోమకార్యక్రమాలను నిర్వహింపజేశారు. విచ్చే సిన భక్తులందరికీ స్వామీజీ తన ఆశీస్సులు తెలియజేశారు. దంపతులందరూ ఆరోగ్యవంతులుగా, మానసిక ప్రశాంతతో హాయిగా వుండాలని, ఆర్థికసమస్యలు తొలగిపోయి అందరూ సుఖశాంతులతో జీవించాలని శ్రీ రామదూతస్వామి అందరినీ ఆశీర్వదించారు. దంపతులందరూ జీవితంలో ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సంతోషంగా వుండాలని స్వామీజీ ఆకాంక్షించారు. అచంచలమైన భక్తివిశ్వాసాలతో ఈ యాగం చేస్తే ఎంతో పుణ్యప్రదమని స్వామీజీ ఈ వ్రత మహత్యం గురించి వివరిస్తూ అన్నారు. శ్రీ రామదూతస్వామివారు ఈ సందర్భంగా శ్రీ వేణుదత్తాత్రేయ స్వామివారికి, వేణుదత్త సువర్ణలక్ష్మికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి భక్తులు ఎస్‌వీఆర్ ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ సన్నపురెడ్డి విజయకుమార్‌రెడ్డి, ఇందూరు వెంకటరమణారెడ్డి (ఆత్మకూరు), యేలూరు శ్రీనివాసులురెడ్డి, తోట మనోహర్, గాదంశెట్టి గోపాల్, పాదర్తి బాలాజీల పర్యవేక్షణలో ఈ యాగం అత్యద్భుతంగా జరిగింది. స్థానిక ప్రముఖులు, స్వామివారి భక్తులు మెంటా రామ్మోహన్‌రావు, శేగు హనుమంతరావు, భవనాసి సురేష్, ముప్పసాని శ్రీనివాసులు తదితరులంతా పాల్గొని ఈ మహాయాగాన్ని ఆద్యంతం అద్వితీయంగా నిర్వహించేందుకు కృషిచేశారు.

# అభివృద్ధికి ల్యాండ్ మార్క్ మోడీ



ప్రధాని నరేంద్ర మోడీ అభివృద్ధికి చిరునామాగా మారారని చత్తీస్‌ఘడ్ ఎంపీ, నెల్లూరుజిల్లా బీజేపీ పరిశీలకుడు సన్‌సద్ అభిషేక్‌సింగ్ చెప్పారు. 1వ తేదీ నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ నాయకత్వంలో దేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అతితక్కువ కాలంలోనే బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల మనసులకు చేరువైంది. జిఎస్‌టి బిల్లుతో దేశ జిడిపి అనూహ్యంగా పెరిగింది. దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఇది ఆర్థిక ప్రయోజనకరంగా మారింది. ఓబిసి రిజర్వేషన్ బిల్లుతో ఆ వర్గాల ప్రజలకు ఉద్యోగ, విద్యావకాశాలు పెరిగాయి. పెద్దనోట్ల రద్దుతో అవినీతి పెకిలించే ప్రక్రియ మొదలైంది. సర్జికల్ స్ట్రైక్స్ ద్వారా తీవ్రవాదులకు తీవ్రమైన హెచ్చరికలు పంపాము. మోడీ ప్రధాని అయ్యాక ప్రపంచవ్యాప్తంగా దౌత్య సంబంధాలు బలపడ్డాయని చెప్పారు. మోడీ విధానాలకు ప్రజలు జేజేలు పలుకుతున్నారని, అందుకు మొన్నటి ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలే ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు.

ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపరెడ్డి సురేష్ రెడ్డి, రాష్ట్ర అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన సహస్రాబ్ది జయంతి ఉత్సవాలు



నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో గత నెల 22వ తేదీ నుండి జరిగిన శ్రీ విశిష్టాద్వైత స్థాపనాచార్యులు శ్రీ భగవద్రామానుజాచార్యుల సహస్రాబ్ది(1000వ) జయంతి మహోత్సవాలు మంగళవారంతో వైభవంగా ముగిసాయి. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యతులందరి అనుగ్రహ మంగళాశాసనములతో మహోత్సవాలు 11రోజులు ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు పర్యవేక్షణలో జరిగాయి. ముగింపు సందర్భంగా ఉదయం భగవద్రామానుజాచార్యుల వారికి నిత్య తిరువారాధన, రామానుజ అష్టోత్తరం, తిరువాయి మొళిసేవ, మహానివేదన, కర్పూర నీరాజనం, శ్రీరామానుజుల వారు దర్శించిన దివ్య దేశాల క్షేత్రాల వస్త్ర బహుమానం, ఇతిహాస పురాణ తిరువాయిమొళి, శాత్తుమొర్రై, తీర్థ, ప్రసాద గోష్ఠి నిర్వహించారు. అనంతరం గంధపొడి ఉత్సవం విశేషంగా జరిగింది. ఉభయకర్తగా ఆరావముద గోష్ఠి వ్యవహరించారు. రాత్రి 7.30గంటలకు మొదలి యాండాన్ స్వామివారి వర్ష తిరునక్షత్ర మహోత్సవం జరిగింది.

ఈ సందర్భంగా జయంతి మహోత్సవాల్లో తమవంతు సహాయసహకారాలందించిన ఉభయకర్తలకు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు, సభ్యులు, ఇఒకు సత్కారం నిర్వహించారు.

# భక్తి రసభరిత కావ్యం..'శ్రీ శ్రీనివాస కల్యాణము'

పుస్తక సమీక్ష

అనేకమంది రచయితలు నేటికాలంలో నానీలు, హైకూలు, గేయాలు రాస్తున్నారు. పద్యకవిత్వం రాసేవారు కరువైపోయారు. అయితే, ఇటువంటి పరిస్థితుల్లో కూడా మరికొంతమంది గొప్పగా పద్య రచన చేస్తూ, తమలోని భక్తిభావాన్ని ప్రకటించడానికి పద్యకావ్యాలను రచిస్తూ ఆంధ్రసరస్వతిని అలరింపజేస్తున్నారు. సమాజంలో పద్య కావ్యాలను చదివి ఆనందించేవారు ఎందరో వున్నారు. భక్తి రస ప్రపూర్ణమైన పద్యకావ్యాలలో ఇటీవల వెలువడిన 'శ్రీ శ్రీనివాస కల్యాణము' ఒకటి.

భక్తజన మనోనేత్రాలకు ఆనందాన్ని కలిగించాలనే ప్రయత్నంతో శ్రీ వేంకటేశ్వరస్వామివారి కల్యాణ గాధను పద్యకావ్యంగా రాసినవారు విద్వాన్ డా. చీమకుర్తి వేంకటేశ్వరరావుగారు. మంచితనం మూర్తీభవించిన ఈయన ఎంతో సౌమ్యుడు.. నిరాడంబరుడు. వీరి తండ్రిగారు చీమకుర్తి జ్వాలాపతి రావుగారు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులైనప్పటికీ రామాయణ, భారత, భాగవత పురాణాలను విశదీకరిస్తూ పద్యరచన చేస్తూ వుండేవారు. తండ్రిగారి నుంచి వారసత్వంగా సంక్రమించిన కవితాధారతో పాటు నాలుగు సంవత్సరముల విద్వాన్ కోర్సును నెల్లూరు మూలాపేట వేదసంస్కృత కళాశాలలో చదవడం, తెలుగులో ఎంఏ పూర్తిచేసి గోలుకొండ నవాబుల నాటి తపతీ సంవరణము, వైజయంతీ విలాస గ్రంథములపై ప్రత్యేక పరిశీలనతో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టా పుచ్చుకోవడం, దాదాపు అర్థశతాబ్దం సుదీర్ఘ బోధనానుభవం, ఇనమడుగు సత్యానందాశ్రమ ఆస్థాన పండితులుగా వుండడం, నెల్లూరు చిన్మయామిషన్ అధ్యక్షులుగా వ్యవహరించడం నేపథ్యంగా ఈ 'శ్రీ శ్రీనివాస కల్యాణము' పద్యకావ్యం వెలసింది. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ శ్రీనివాసునికి పద్మావతీదేవితో జరిగిన కమనీయమైన కల్యాణ వృత్తాంతము ఇందులోని కథ. అయిదు అశ్వాసాలతో 500కు పైగా పద్యాలతో వివిధ రకాల సాంప్రదాయ వృత్తములతో ఈ కావ్యం విలసిల్లుతూ చదువరులకు ఎంతో ఆసక్తిని కలిగిస్తుంది. పద్యరచనా విధానంలో పోతన మొదలైన పూర్వకవుల ప్రభావం ఈ గ్రంథంలో అడుగడుగునా గోచరిస్తూ వుంటుంది.

"చేసిన పాపముల్ తొలగు".. అనే పద్యంలో పురాణ కథా ప్రవచన వైభవం కనిపిస్తుంది. 'ధారుణీ ధర్మమున్ నిలుప'.. అనే పద్యం, 'పరిత్రాణాయ సాధూనాం' అనే గీతాశ్లోకాన్ని తలపిస్తుంది. 'సతత నారాయణ శబ్దంబు' అనే పద్యంలో నారద మహర్షి యొక్క వర్ణచిత్రం ప్రత్యక్షమవుతుంది. గంగా తీరానికి వస్తూ నారదమహర్షి శ్రీమన్నారాయణుని స్తుతించిన సందర్భంలో 'జయ నారాయణా ఆదిదేవ' అనే పద్యం పాఠకులకు దైవప్రార్థనగా ఉపకరించేదిగా వుంది. 'పీతాంబరంబులు విడనాడి' అనే పద్యం కవిగారి సంభాషణా చాతుర్యాన్ని తెలియజెబుతుంది. 'నంద కుమార నిన్ గనని నా మది' అనే పద్యం కవిగారి పద్యరచనలో ఆర్ద్రతకు ఉదాహరణగా వుంది. 'నన్నున్ జూడగవచ్చు భక్తజనముల్' అనే పద్యం సహజ సుందరమైన కవిత్వానికి తార్కాణంగా వుంది. 'పులులు భయంబున పొదరిండ్లలో దూరె'.. అనే పద్యంలో ప్రబుద్ధకవుల శైలి సుస్పష్టమవుతోంది. సోది చెప్పిన తీరు కళ్ళకు కట్టినట్లుగా 'అమ్మోయమ్మ'..అనే పద్యంలో వుంది. 'పతిని దైవంబుగా భావింపు మెపుడు' అనే సీసపద్యంలో కొత్తపెండ్లికూతురుకు అవసరమైన ఉపదేశం చక్కగా వుంది. ఇలా ప్రతి ఆశ్వాసం పూర్తి అయ్యేటప్పుడు పంచచామరం, మత్తకోకిల వంటి విశేష చందస్సులో పద్యరచన చేయడం కవి డా. చీమకుర్తిగారి ఛందోజ్ఞానాన్ని తెలియజేస్తుంది. చోళరాజు తనకు ప్రత్యక్షమైన విష్ణువును దర్శించిన దృశ్యాన్ని దండకంగా రచించడం.. ఆయన అమోఘమైన రచనాశైలికి నిదర్శనం.

'ధారాశుద్ధి సంశోభిత పద్యాలతో, శయ్యా వైభవంతో, నుడికారపు సొంపులతో, ప్రౌఢ సమాస ఘటితంగా, సరళ సుందర సమన్వితంగా, అలంకారపు సొగసులతో రసరమ్యంగా అవతరించిన శ్రీ శ్రీనివాస కల్యాణము పద్యకావ్యం సాహితీ ప్రియంభావుకులకు ఒక విధంగా మృష్టాన్నభోజనమే..అని కావ్యం ప్రారంభంలో ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తిగారు చీమకుర్తిగారి కవిత్వాన్ని అభినందించివున్నారు కూడా. ఇది సంపూర్ణముగా సత్యము. తొలుతగా ఈ కవి 'గీతామృతము' అనే పేరుతో తెలుగులో భగవద్గీత సరళసుందరంగా గీతపద్యాలలో రాసివున్నారు. ఆ తరువాత 'జగదంబ శతకము', 'జనప్రియ శతకము'లతో పాటు అరవై మంది తెలుగు కవుల కవితావైభవాన్ని వివరించే 'తెలుగు తోట' అనే గ్రంథం రచించారు. తిక్కన మూర్తిమత్వాన్ని కూడా డా.చీమకుర్తివారు పద్య రూపంగా వివరించివున్నారు.

వీరు ఒకవైపు గ్రంథరచన చేస్తూనే మరోవైపు సాహిత్య, ఆధ్యాత్మిక ఉపన్యాసాలతో సమాజానికి హితాన్ని పంచుతూనే వుండడం ఎంతైనా అభినందనీయం. పాఠకులు భక్తిరసభరితమైన ఈ 'శ్రీనివాస కల్యాణము' పద్యకావ్యాన్ని ఆసాంతం ప్రశాంతంగా చదివి కలియుగ ప్రత్యక్షదైవమైన ఆ ఏడుకొండల స్వామి దివ్యవైభవాన్ని హృదయఫలకంపై సాక్షాత్కరింపజేసుకుని దేవదేవుడైన ఆ శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహాన్ని పొందగలరని మనసారా ఆశిస్తున్నాను.






**శ్రీ శ్రీనివాస కల్యాణము (పద్యకావ్యము)**

రచన:
విద్వాన్ డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు
రిటైర్డ్ తెలుగు లెక్చరర్
ఎస్-10, పిటిజి రాజ్ టవర్స్,
రేబాలవారివీధి, స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు-2
ఫోన్: 99088 55294



సమీక్షకులు:
**కోట రాజశేఖర్ అవధాని**
నెల్లూరు.
ఫోన్: 99662 36604



# ఆత్మీయోత్సవం, ఆనందోత్సవం, అభినందనోత్సవం ప్రజిత్ - సింధూర వివాహ రిసెప్షన్ మహోత్సవం




'లాయర్' వారపత్రిక వ్యవస్థాపకులు కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డి - శ్రీమతి శ్రీదేవమ్మల మనుమడు, తుంగా శివప్రభాత్‌రెడ్డి - శ్రీమతి భారతిల కుమారుడు **శివప్రజిత్ - సింధూర** వివాహ రిసెప్షన్ మే 1వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. అత్యంత కోలాహలంగా జరిగిన ఈ వేడుకలో వేలాదిమంది 'లాయర్' అభిమానులు, తుంగా కుటుంబ ఆత్మీయులు, ఆప్తులతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని నవదంపతులకు తమ దీవెనెలు అందించారు.




















Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com